# బలగం TV BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 19 మార్చి-2026 balagamtv100@gmail.com పేజీలు-4


## ఒక వైపు తండ్రి చావు... మరో వైపు పరీక్ష

బాధను గుండెల్లో దాచుకుని పరీక్ష హాలుకి వెళ్లిన చిన్నారి

ఇంట్లో రోదనలు... చేతిలో పెన్ -- హృదయ విదారక దృశ్యం



## రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీకాల కార్యక్రమం

తనిఖీలు నిర్వహించిన డాక్టర్ ఎస్. రజిత



## భారీ ఈదురు గాలులు, పిడుగులు పడే ఛాన్స్!



- వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు

హైదరాబాద్-మార్చి 18 : వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక వరకు తమిళనాడు మీదుగా సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో అల్పపీడన ద్రోణి విస్తరించి ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మారిపోయింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. తాజా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వాతావరణ కేంద్రం అత్యంత కీలకమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ మరియు కృష్ణా జిల్లాల్లో రాగల కొన్ని గంటల్లో తీవ్రమైన ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని మిగతా 2లో..

## హార్ముజ్ నుంచి 2 నౌకలు తెచ్చిన ఎల్పీజీ 2 రోజులు సరిపోదా ?



మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం ట్వీట్

ఇరాన్-మార్చి 18 : ఇరాన్ వార్ నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని మూసేయడంతో భారత్ సహా పలు దేశాలు ఇబ్బందులు పడుతు న్నాయి. ఈ నేపథ్యంలో ఈ జలసంధిలో చిక్కుకుపోయిన భారత నౌకలు శివాలిక్, నందా దేవీలను వదిలిపెట్టాలని ఇరాన్ ను కేంద్రం కోరడంతో వాటికి విముక్తి లభించింది. దీంతో అవి సురక్షితంగా భారత్ కు చేరుకున్నాయి. వీటిలో మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ భారత్ కు వచ్చింది. అయితే ఈ ఎల్పీజీ భారత్ లో అవసరాలకు ఎన్ని రోజులకు సరిపోతుందన్న చర్చ జరుగుతోంది.ఈ నేపథ్యంలో భారత్ లో ఎల్పీజీ డిమాండ్ ఎలా ఉంది, దీన్ని తట్టుకునేందుకు ఈ రెండు నౌకల్లో వచ్చిన ఎల్పీజీ ఎంత మేరకు పనికొస్తుందన్న దానిపై మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఇవాళ ఓ ట్వీట్ చేశారు. గూగుల్ నుంచి సేకరించిన సమాచారం అంటూ చిదంబరం కొన్ని వివరాలను ఎక్స్ లో షేర్ చేశారు. ఇందులో ఆయన ప్రస్తుతంలో భారత్ లో ఎల్పీజీ డిమాండ్ మేరకు చూసుకుంటే హార్ముజ్ జలసంధి ద్వారా వచ్చిన రెండు నౌకల్లో ఎల్పీజీ కేవలం 2 రోజులకూ సరిపోదని తేల్చారు. 2026 మార్చి 14-17 తేదీల నివేదికల ప్రకారం, భారత జెండా కలిగిన రెండు ఎల్పిజి నౌకలు, శివాలిక్ మరియు నందా దేవి, మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పిజిని తీసుకువెళ్లి హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటాయని, ఇందులో రవాణా చేసిన మొత్తం ఎల్పిజి: 92,700 మెట్రిక్ టన్నులు (ఒక్కొక్కటి 46,000 మెట్రిక్ టన్నులకు పైగా తీసుకువెళ్ళింది) అని తెలిపారు. ఈ మొత్తం భారత్ లో మొత్తం వంటగ్యాస్ అవసరంలో సుమారు 1.25 నుండి 1.6 రోజులకు సమానం అని చిదంబరం తెలిపారు. రేపటి కల్లా ఈ గ్యాస్ వాడేయడం ఖాయమని, దీంతో హార్ముజ్ వైపు మళ్లీ నౌకల కోసం ఎదురూచూపులు తప్పవని చిదంబరం చెప్పకనే చెప్పారు.



## గ్యాస్ కొరతతో-ఉపాధికి దెబ్బ

- పెరిగిన గ్యాస్ సిలిండర్ల కొరత
- రోడ్డున పడుతున్న గిగ్ వర్కర్లు,
- గణనీయంగా తగ్గిన ఫుడ్ డెలివరీ ఆర్డర్లు
- చిన్న బండ్ల వ్యాపారాల నుండి పెద్ద రెస్టారెంట్ల వరకు పొట్టపోషించుకునే కార్మికుల పరిస్థితి దుర్భరం
- స్విగ్గీ, జొమాటో డెలివరీ ఏజెంట్ల దినసరి ఉపాధికి తీవ్ర ముప్పు
- జీవనోపాధులు గ్యాస్ సిలిండర్ల దెబ్బకు కుదేలు



న్యూఢిల్లీ-మార్చి18 : గ్యాస్ కొరత ఉపాధి దెబ్బ తీస్తోంది. గ్యాస్ సిలిండర్ల కొరత పెరిగింది. దీని కారణంగా చిన్న హోటళ్లు, ధాబాలు, క్లౌడ్ కిచెన్లు తమ కార్యకలాపాలు తగ్గించుకోవాల్సి రావడంతో ఫుడ్ డెలివరీ ఆర్డర్లు గణనీయంగా పడిపోయాయి. ఒకటేమిటీ ... చిన్న బండ్ల వ్యాపారాల నుండి పెద్ద రెస్టారెంట్ల వరకు పొట్టపోషించుకునే కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారింది. స్విగ్గీ, జొమాటో లాంటి సంస్థ ల్లో పనిచేసే డెలివరీ ఏజెంట్ల దినసరి ఉపాధికి తీవ్ర ముప్పు వాటిల్లింది. గ్యాస్ కొరతతో దాబాలు, క్యాటరింగ్ సేవలు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారాలు ఎక్కడికక్కడ నిలిచిపోవ డంతో ఫుడ్ ఆర్డర్లు ఏకంగా 50-60 శాతం మేర పడిపోయాయి. రోజుకు 30 ఆర్డర్లు డెలివరీ చేస్తూ ఉపాధి పొందే ఏజెంట్లకు, ఇప్పుడు కనీసం 5 నుంచి 10 ఆర్డర్లు కూడా రావడం గగనంగా మారింది. అన్ని రంగాల జీవనోపాధులు గ్యాస్ సిలిండర్ల దెబ్బకు కుదేలవుతున్నాయి. హోటళ్లలో వంటలు తగ్గడంతో జొమాటో, స్విగ్గీ వంటి ప్లాట్ ఫారమ్‌లలో ఆర్డర్లు తగ్గిపోయాయి. గతంలో రోజుకు 30 నుంచి 40 ఆర్డర్లు చేసేవారికి ఇప్పుడు 20 కూడా రావడం లేదని డెలివరీ సిబ్బం ది చెబుతున్నారు.



## తెలంగాణ ప్రభుత్వం పండుగ వేళ తీపికబురు

- 'కల్యాణ లక్ష్మి' సాయం పెంపు, రూ.2,016 పెన్షన్ ఇక నుంచి !!
- ఈ సారి బడ్జెట్‌లో పెండింగ్ హామీల అమలు దిశగా ప్రాధాన్యత
- 2026-27 బడ్జెట్ ప్రతిపాదనల పైన తుది కసరత్తు
- ఈ సారి బడ్జెట్ ప్రతిపాదనల్లో వ్యవసాయం, సంక్షేమ రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట
- మౌలిక వసతుల కల్పన దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉండే అవకాశం

తెలంగాణ ప్రభుత్వం పండుగ వేళ గుడ్ న్యూస్ చెబుతోంది. 2026-27 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీ లో ప్రవేశ పెట్టేందుకు ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఈ సారి బడ్జెట్‌లో పెండింగ్ హామీల అమలు దిశగా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా పెన్షన్ పెంపు ఒకే సారి కాకుండా దశల వారీగా పెంచేందుకు నిర్ణయించారు. దీంతో పాటుగా కల్యాణ లక్ష్మీ/ షాదీ ముబాకర్ మొత్తాన్ని పెంచనున్నారు. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూనే.. మౌలిక వసతుల కల్పన దిశగా బడ్జెట్ కేటాయింపులు ఉండే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణ మిగతా 2లో..

## "అణచివేయాలని కుట్ర.. అయినా నో కాంప్రమైజ్"



న్యూఢిల్లీ-మార్చి 18 : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అరవ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. తమిళనాట అధికారాన్ని నిలుపుకునేందుకు డీఎంకే- కాంగ్రెస్ కూటమి ప్రయత్నిస్తున్నాయి. తిరిగి అధికారం పొందేందుకు ఏఐఏడీఎంకే-బీజేపీ కూటమి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఇక తొలిసారిగా ఎన్నికల బరిలో నిలుస్తున్న టీవీకే పార్టీ అధ్యక్షుడు, దళపతి విజయ్.. విజయం తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడులో ఈసారి రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మిగతా 2లో..

## మోదీ మంత్రివర్గం సంచలన నిర్ణయాలు

- రూ.33,660 కోట్లతో 'భారత్ ఆద్యోగిక్ వికాస్ యోజన' పథకానికి మంత్రివర్గం ఆమోదం
- భారత్ ను స్వయం సమృద్ధిగా మార్చడమే ఈ పథకం లక్ష్యం
- 100 పెద్ద పారిశ్రామిక నగరాల అభివృద్ధి
- పశ్చిమాసియాలో ఏమాత్రం తగ్గని ఉద్రిక్తతలు



న్యూఢిల్లీ-మార్చి 18 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. రెండు వారాలుగా ఇరాన్- ఇజ్రాయెల్- అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ సహా అనేక కీలక ప్రాంతాలపై ఇజ్రాయెల్, అమెరికా క్షిపణులు దాడులకు పాల్పడుతూనే ఉన్నాయి. అలాగే లెబనాన్ రాజధాని బీరుట్ పైనా ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతోంది. మరోవైపు ఇజ్రాయెల్ తో పాటు అమెరికా సైనిక స్థావరాలే టార్గెట్‌గా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర కేబినెట్ సమావేశం అయింది. ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం అయింది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ మేరకు రూ.33,660 కోట్లతో 'భారత్ ఆద్యోగిక్ వికాస్ యోజన' పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. భారత్ ను స్వయం సమృద్ధిగా మార్చడమే ఈ పథకం లక్ష్యమని అన్నారు. దాంతోపాటు 100 పెద్ద పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇక భారత్ లో తయారైన వస్తువులను ప్రపంచవ్యాప్తంగా విక్రయించడమే లక్ష్యంగా ఉన్న 'మేక్ ఇన్ ఇండియా' కు ఇది ఒక విస్తృత రూపమని కేంద్ర మిగతా 2లో..

## వ్యాపారం బంద్.. వేల కోట్ల పెట్టుబడులు గోవిందా..!

- ఇరాన్-అమెరికా మధ్య రేగిన ఉద్రిక్తతలు
- ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు మిగతా 2లో..



## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

కలెక్టర్ గరిమ అగ్రవాల్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ గరిమ అగ్రవాల్? బుధవారం పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ వార్డులు, మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ గది, ఎక్స్ రే గది, యునాని హాస్పిటల్, ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓకు సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య అధికారి రజిత, డీసీ హెచ్ ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు వేళ.. టీజీఎస్ఆర్టీసీ బిగ్ డెసిషన్..!!

- పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నోటీసు
- తెలంగాణ ఆర్టీసీ మరో షాకింగ్ నిర్ణయం మిగతా 2లో..



(మొదటిపేజీ తరువాయి)

## తెలంగాణ ప్రభుత్వం పండుగ వేళ తీపికబురు

ప్రభుత్వం 2026-27 బడ్జెట్ ప్రతిపాదనల పైన తుది కసరత్తు చేస్తోంది. ఈ సారి బడ్జెట్ ప్రతిపాదనల్లో వ్యవసాయం, సంక్షేమ రంగాలకు బడ్జెట్‌లో పెద్ద పీట వేయనుంది. రైతు భరోసా, సన్నాలకు రూ.500 చొప్పున బోనస్, రైతు బీమా, ఆయిల్‌పామ్ సాగు వంటి పథకాలకు నిధులు కేటాయించనుంది. యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాలకు ప్రాధాన్యత దక్కనుంది. కాగా.. పెండింగ్‌లో ఉన్న ఎన్నికల హామీల అమలు దిశగానూ బడ్జెట్ లో కేటాయింపు లు ఉంటాయని తెలుస్తోంది. అందులో భాగంగా కల్యాణలక్ష్మి/ షాదీ ముబారక్ పథకం కింద ఇచ్చే ఆర్థిక సాయాన్ని ఈసారి పెంచే ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం రూ.1,00,116 అందిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సాయానికి మరో రూ.50 వేలు పెంచి రూ.1,50,116 చొప్పున అందించే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ ప్రతిపాదనల పై తుది కసరత్తు అదే విధంగా చేయూత పింఛన్లను కూడా పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. పెన్షన్లు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. ప్రస్తుతం రూ.2,016 చొప్పున పింఛను అందిస్తోంది. 500 పెంచి, రూ.2,516 చొప్పున ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కాలేజీ విద్యార్థినులకు ఈ-స్కూటీలను అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈసారి బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. దీని కింద రూ.1600 కోట్లు కేటాయింపు లు చేయాల్సిన అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో.. ఈ సారి బడ్జెట్ లో మొత్తం గా రూ.3.20 లక్షల కోట్లకు కాస్త అటూ ఇటుగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. దానికి మరో 5 శాతం పెంచి 2026-27 బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రాబడులకు అనుగుణంగా ప్రభుత్వం వ్యయాలు చేస్తూ వస్తోంది. ద్రవ్య లోటును బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా పూడ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

## గ్యాస్ కొరతతో-ఉపాధికి దెబ్బ

గంటల తరబడి యాప్ కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఆర్డర్లు రాకపోతే డెలివరీ తగ్గుతుంది. దాని ప్రభావం వారి జీతాలపై పడుతుంది. ఈ సంక్షోభం డెలివరీ కార్మికులతో పాటు క్లౌడ్ కిచెన్లలో పనిచేసే ఉద్యోగులు, వీధి వ్యాపారుల జీవనాధారాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. కొందరు ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వంటి ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నప్పటికీ పెరిగిన విద్యుత్ బిల్లులు భారంగా మారుతున్నాయి. కట్టెల పొయ్యిలు పెడదామన్నా.. ఇప్పుడు కట్టెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.. కరెంటు పొయ్యిలు వాడదామంటే పెరిగే కరెంటు బిల్లు తలుచుకుంటేనే గుండె గుభేలుమంటోందంటూ ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులను ఆదుకునేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ యూనియన్ ప్రతినిధులు కేంద్ర కార్మిక శాఖకు లేఖ రాశారు. స్విగ్గీ, జొమాటో లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు ఉపాధి కోల్పోయిన డెలివరీ ఏజెంట్లకు తక్షణ పరిహారంగా రూ. 10,000 చెల్లించాలి. ఏజెంట్ల వర్క్ ఐడీలపై 3 నెలల పాటు మారటోరియం విధించాలి. 'సామాజిక భద్రతా కోడ్-2020' కింద గిగ్ వర్కర్లందరికీ పూర్తిస్థాయి కవరేజీ కల్పించాలని అభ్యర్థించారు.

## మోదీ మంత్రివర్గం సంచలన నిర్ణయాలు

మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2023-24 పత్తి సీజన్ ఎంఎస్‌పీ రీయింబర్స్ మెంట్ కు రూ. 11,712 కోట్లు కేటాయించిందని అన్నారు. అలాగే ఎన్‌హెచ్-92 బారాబంకి నుండి బహ్రైచ్ సెక్షన్ వరకు నాలుగు లేన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్గం రూ. 6,969 కోట్లు కేటాయింపులు చేసింది. ఇక చిన్న జల విద్యుత్ అభివృద్ధి పథకానికి రూ. 2,585 కోట్లు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సంవత్సరం 2026-27 నుంచి 2030-31 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. అలాగే దేశవ్యాప్తంగా సుమారు 1500 మెగావాట్ల (ఎండబ్ల్యు) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానంగా 1 నుంచి 25 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులకు ఈ పథకం కింద మద్దతు లభించనుంది. రాష్ట్రాలకు లభించే ఆర్థిక ప్రోత్సాహకాలు ఈ పథకం ద్వారా కొండ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలకు మెరుగైన ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

## "అణచివేయాలని కుట్ర.. అయినా నో కాంప్రమైజ్"

మారుతున్నాయి. టీవీకే అధ్యక్షుడు, దళపతి విజయ్ చుట్టూనే ప్రస్తుతం తమిళ రాజకీయాలు తిరుగుతున్నాయి. తొలిసారిగా తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయనకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరూర్ తొక్కిసలాట దగ్గరినుంచి రజనీకాంత్ ఎపిసోడ్ వరకూ విజయ్ వెంట వివాదాలు చుట్టు ముడుతూనే ఉన్నాయి. అయితే తాజాగా టీవీకే పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ వేడుకలో విజయ్ పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా తమిళనాడులోని మహాబలిపురంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీకి అన్ని మతాలు సమానం అని.. అన్ని మతాల విశ్వాసాలను కాపాడటంలో టీవీకే పార్టీ కాంప్రమైజ్ అవ్వదని తెలిపారు. తమిళనాడులో ఒంటరిగానే పోటీ చేస్తామని వివరించారు. ఎన్డీయే కూటమిలోకి వెళ్లే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. తాము ఎవరి టీమ్ కాదని.. ప్రజల టీమ్ అని విజయ్ పేర్కొన్నారు. టీవీకే లీడర్ షిప్ ఆధ్వర్యంలోనే ప్రభుత్వం ఉంటుందని విజయ్ క్లారిటీ ఇచ్చారు. సామాజిక న్యాయం, సెక్యూలరిజంపై కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదని విజయ్ తేల్చి చెప్పారు. రకరకాలుగా తమను అణచివేయాలని కొన్ని శక్తులు ప్లాన్ చేస్తున్నాయని.. అది సాధ్యం కాకపోవడంతో తమపై ఫేక్ ప్రచారం నిర్వహిస్తున్నాయని విజయ్ మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వాన్ని త్వరలోనే అమలు చేస్తామని అందులో వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని విజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు పొత్తుపై మరోసారి విజయ్ క్లారిటీ ఇచ్చారు. సింగిల్ గానే పోటీ చేస్తామని తమకు డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలతో పొత్తు లేదని తేల్చారు. దేవుడి దయతో అనుకున్న టార్గెట్ ను సాధిస్తామని అన్నారు.

## భారీ ఈదురు గాలులు, పిడుగులు పడే ఛాన్స్!

చోట్ల వడగళ్ల వాన పడే ప్రమాదం ఉందని, గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద లేదా బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని సూచించారు.

# రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి రోజా

- తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు
- హోరా హోరీ అధికార - ప్రతిపక్షాల మధ్య రాజకీయం



**హైదరాబాద్, మార్చి 18:** తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తి కర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ హోరా హోరీ అధికార - ప్రతిపక్షాల మధ్య రాజకీయం నడుస్తోంది. కాగా, ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డిని వైసీపీ మాజీ మంత్రి రోజా కలవటం.. ఇద్దరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకొని.. పలకరింపులు ఈ రోజున రాజకీయంగా ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ ఇద్దరి పలకరింపు వీడియో.. ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ప్రియాంక గాంధీతో పాటుగా పార్టీ అధినేత ఖర్గేను కలిసేందుకు రేవంత్ పార్లమెంట్ కు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ మాజీ మంత్రి రోజా పార్లమెంట్ లాబీల్లో రేవంత్‌కు ఎదురుపడ్డారు. రోజాకు మర్యాదపూర్వకంగా షేక్ హ్యాండ్ ఇచ్చిన రేవంత్ రెడ్డి, ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాను పని మీద పార్ల మెంట్ కు వచ్చినట్లు రోజా తెలిపారు. ఆ తరువాత ఇద్దరూ అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్? లో రోజా, రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు రోజా ఏపీలోని తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చారు. ఈ విషయం పైన పలు సందర్భాల్లో కేసీఆర్ ను టార్గెట్ చేస్తూ.. రేవంత్ పలు మార్లు సెటైర్లు వేసారు. అయితే, ఇద్దరూ ఎదురు పడటంతో పలకరించుకోవటం.. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వటం నిమిషాల్లో జరిగిపోయింది. నితిన్ గడ్కరీతో రోజా భేటీ కాగా, రోజా పార్లమెంట్ లో వైసీపీ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశం అయ్యారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించబడుతున్న 200 సంవత్సరాల ప్రాచీన ఆలయం విషయాన్ని ప్రాధాన్యంగా ప్రస్తావిస్తూ, అది నగరి చరిత్ర, సంప్రదాయం, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిందని వివరించారు, దాని చారిత్రక ప్రాముఖ్యతను కాపాడే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గడ్కరీని కోరారు. అదేవిధంగా కొండ చుట్టూ మండపం ఏర్పాటు, నగరిలో పెరుగుతున్న రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణం అవసరం, పుత్తూరు ప్రాంతం లో జాతీయ రహదారి పనులు నెమ్మదిగా సాగడం, సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు వంటి అంశాలను సమగ్రంగా వివరించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ సమస్యలను అత్యవసరంగా పరిగణించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిథున్ రెడ్డితో పాటుగా గడ్కరీని కలిసిన రోజా వినతుల పైన సానుకూ స్పందన వ్యక్తం అయింది.

# సమ్మె నోటీసు వేళ..టీజీఎస్ఆర్టీసీ బిగ్ డెసిషన్..!!

- పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నోటీసు
- తెలంగాణ ఆర్టీసీ మరో షాకింగ్ నిర్ణయం




**హైదరాబాద్-మార్చి 18 :** టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. అటు ఉద్యోగ సంఘాలు తమ పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె నోటీసు ఇచ్చాయి. 13వ తేదీన సమ్మె నోటీసు ఇచ్చిన ఆర్టీసీ జేఏసీ నేతలు 14 రోజుల తరువాత సమ్మెకు వెళ్తామని హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులకు సంబంధించి తెలంగాణ ఆర్టీసీ మరో షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు చాలా కాలంగా అమలు చేస్తున్న విధానం రద్దు చేసారు. తెలంగాణ ఆర్టీసీ తాజాగా తీసుకున్న నిర్ణయం పైన చర్చ మొదలైంది. ఉద్యోగులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటే ప్రత్యేక ప్రోత్సాహకం కింద ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇప్పటివరకూ ఇస్తున్నారు. ఇప్పుడు దానిని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు అధికారులు. ఇకపై తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ ప్రత్యేకంగా ఏవిధమైన బెనిఫిట్ ఉండదు. గతంలోనే ప్రభుత్వం ఇటువంటి ఇంక్రిమెంట్స్ నిలిపివేసింది. అయితే, ఆర్టీసీ కార్పొరేషన్ కావడంతో ఇక్కడ ఇప్పటివరకూ అది అమలులోకి రాలేదు. తాజాగా ప్రభుత్వ నిబంధనలకు సమానంగా కార్పొరేషన్ లోని నిబంధనలు కూడా ఉండాలనే విధానంలో భాగంగా టీజీఎస్ ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత స్టెరిలైజేషన్ చేయించుకుంటే ఉద్యోగులు లేదా వారి జీవిత భాగస్వాములకు పర్సనల్ సాలరీ రూపంలో ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చేవారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం 1998లోనే ఈ పథకాన్ని నిలిపివేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం నిలిపివేసినా.. ఇప్పటికీ విభజన తరువాత కూడా దీనిని టీజీఎస్ ఆర్టీసీ కొనసాగిస్తూ వస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానంలో వైరుధ్యాలను తొలగించడం లక్ష్యంగా ఈ తాజా నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. సవరించిన ఉత్తర్వుల ప్రకారం, మార్చి 17, 2026న లేదా ఆ తర్వాత కుటుంబ నియంత్రణ ప్రక్రియలు చేయించుకునే ఉద్యోగులు ఇకపై ఈ ప్రోత్సాహక ఇంక్రిమెంట్ కు అర్హులు కారు. కుటుంబ నియంత్రణ కోసం ఇస్తున్న ఈ ఇంక్రిమెంట్ నిలిపివేసినా.. కొన్ని సంక్షేమ నిర్ణయాలు కొనసాగుతాయని స్పష్టం చేసారు. తాజా నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులందరినీ ఆదేశించింది.

# ప్రాజెక్టుపై ప్రభుత్వానికి స్పష్టత ఉన్నదా?

- బఫర్ జోన్‌ను ఎలా నిర్ధారించారు?
- డీపీఆర్‌ను సర్కార్ రూపొందించిందా?
- ప్రాజెక్టుకయ్యే అంచనా వ్యయం ఎంత?
- నిర్వాసితులయ్యే కుటుంబాలు ఎన్ని?
- కల్పించే పునరావాస సౌకర్యాలేమిటి?
- అసెంబ్లీలో ప్రశ్నలు సంధించిన కేటీఆర్
- షార్ట్ డిస్కషన్ పెట్టి వివరాలు చెప్తామని దాటవేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- సర్కార్ తీరుపై బీఆర్ఎస్ అసంతృప్తి
- శాసనసభ నుంచి ఎమ్మెల్యేల వాకౌట్



**హైదరాబాద్, మార్చి 18:** 'మూసీ సుందరీకరణ ప్రాజెక్టు తయారీ రిపోర్టు మొదలు బఫర్ జోన్ నిర్ధారణ, ఇండ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు ఇలా ప్రతి అంశంపై ప్రభుత్వం విభిన్న ప్రకటనలు చేస్తున్నది. పొంతనలేని సమాధానాలు, పూటకో మాట చెప్తున్నది. ప్రభుత్వానికి ఏమైనా స్పష్టత ఉన్నదా? ఉంటే సభలో ప్రవేశపెట్టాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వాదనల్లోని డొల్లతనాన్ని, విరుద్ధ అంశాలను శాసనసభ వేదికగా నిలదీశారు. ఇష్టారీతిన కొనసాగిస్తున్న ఇండ్ల కూల్చివేతలను ప్రశ్నించారు. వాటికి సర్కార్ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. అసెంబ్లీలో బుధవారం ఉదయం కొనసాగిన ప్రశ్నోత్తరాల్లో కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై పలు ప్రశ్నలు సంధించారు. 'డీపీఆర్‌ను ప్రభుత్వం రూపొందించిందా? ఒకవేళ ఉంటే ప్రాజెక్టు అంచనా వ్యయం ఎంత? ప్రాజె క్టు వల్ల నిర్వాసితులయ్యే కుటుంబాలు ఎన్ని? ఆ కుటుంబాలకు ప్రభుత్వం అందించే పునరావాస సౌకర్యాలేమిటి? తదితర వివరాలు వెల్లడించాలి' అని కేటీఆర్ కోరారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి 18 నెలల సమయం పడుతుందని జనవరిలో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వయంగా ప్రకటించారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇటీవల నిర్వహించిన సమావేశంలో మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెప్పారని తెలిపారు. ప్రభుత్వం చెప్తున్నదే నిజమైతే, మరి రెండు నెలల మెరుపు వేగంతో ఎలా సాధ్యమైందో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. డీపీఆర్ ఉంటే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొత్తంగా రూ.16 వేల కోట్లతో సుందరీకరణ పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని, కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచారని, దాని వెనుక ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుంటే, సభలో మాత్రం రూ.నాలుగైదు వేల కోట్లని చెప్తున్నారని, అందులో ఏది నిజమని నిలదీశారు. ప్రస్తుతం మొదటి ఫేజ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని ప్రభుత్వం చెప్తున్నదని, మరి మొత్తంగా ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు? ఎంత భూసేకరణ చేస్తారు? ఎన్ని ఇండ్లు కూల్చివేస్తారు? అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కోరారు. ప్రభుత్వం 1,400 ఇండ్లు కూల్చివేస్తామని చెప్తున్నారని, కానీ ఇటీవల గెజిట్‌లో మాత్రం 10వేల ఇండ్లని పేర్కొన్నదని, 3,297 ఎకరాల భూసేకరణ ఉంటుందని తెలిపిందని పేర్కొన్నారు. అది పూర్తిగా ప్రజలను మోసం చేసే ప్రక్రియ అని మండిపడ్డారు. మధుపార్ కోసం ప్రత్యేకంగా ఇండ్లు ఇస్తామని చెప్తున్న ప్రభుత్వం మిగతా వారికి ఎందుకు ఇవ్వదని నిలదీశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్తూనే, మరోవైపు 5 కిలోమీటర్ల దూరంలోని హనుమాన్‌నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ ద్వంద్వ విధానాలకు నిదర్శనమని విమర్శించారు. బఫర్‌జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెప్తున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు.

## వ్యాపారం బంద్.. వేల కోట్ల పెట్టుబడులు గోవిందా..!



- ఇరాన్-అమెరికా మధ్య రేగిన ఉద్రిక్తతలు
- ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు

**హైదరాబాద్, మార్చి 18:** పశ్చిమ ఆసియాలో ఇరాన్-అమెరికా మధ్య రేగిన ఉద్రిక్తతలు కేవలం ఆ దేశాలకే పరిమితం కాలేదు.. అవి వేలాది మంది భారతీయ పారిశ్రామికవేత్తల కలలను, వేల కోట్ల రూపాయల పెట్టుబడులను నీటిపాలు చేసేలా ఉన్నాయి. ముఖ్యంగా యూఏ ఈని తమ రెండో నివాసంగా మార్చుకున్న భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. దాదాపు రూ.12,000 కోట్ల (వి1.3 బిలియన్లు) పెట్టుబడులు ప్రస్తుతం యుద్ధం అంచున వేలాడుతున్నాయి. గత రెండేళ్లుగా అమెరికా తర్వాత భారతీయ సంస్థలకు యూఏఈ అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మారింది. అంతర్జాతీయంగా ఎదగాలని దుబాయ్, అబుదాబిలను ఎంచుకున్న మన స్టార్టప్‌లు, మధ్య తరహా సంస్థలకు ఈ యుద్ధ వాతావరణం పెను శాపంగా మారింది. ఆర్బీఐ గణాంకాల ప్రకారం.. గత ఆరు నెలల్లోనే భారతీయ కంపెనీలు యూఏఈలో భారీగా నిధులు కుమ్మరించాయి. రిటైల్, ఆతిథ్యం రంగాల్లోని 280 సంస్థలు సుమారు వి400 మిలియన్ల పెట్టుబడులు పెట్టాయి. ఇప్పుడు పర్యాటకం దెబ్బతింటే, ఈ సంస్థల ఆదాయం పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. ముప్పులో దిగ్గజాలు.. చిన్న బ్రాండ్లు! యూఏఈ మార్కెట్‌లో పాగా వేసిన గ్రేవిస్ ఫుడ్స్ (వి11.4 మిలియన్లు), ఓయో ప్రాప్‌టెక్ (వి11 మిలియన్లు), హల్దీరామ్ (వి2.8 మిలియన్లు) వంటి పెద్ద కంపెనీలతో పాటు.. 'బ్రహ్మ లైఫ్‌స్టైల్' (వి2 మిలియన్లు), 'సబ్‌కో కాఫీ' వంటి చిన్న బ్రాండ్లు కూడా ఇప్పుడు ఆందోళన చెందుతున్నాయి. పెద్ద కంపెనీలకు నష్టాలను తట్టుకునే శక్తి ఉన్నప్పటికీ, చిన్న సంస్థలు తమ వద్ద ఉన్న మొత్తం మూలధనాన్ని ఇక్కడే పెట్టడం వల్ల, వ్యాపారం కొద్ది నెలలు ఆగినా అవి దివాలా తీసే (Bankruptcy) అవకాశం ఉంది. MSMEలను కుంగదీస్తున్న మూడు ప్రధాన కారణాలు: నిధుల కొరత: చిన్న సంస్థలకు అదనపు నిధులు ఉండవు. వ్యాపార చక్రం ఆగితే అవి కోలుకోవడం అసాధ్యం. బీమా లేకపోవడం: చాలా చిన్న సంస్థలకు 'యాక్టివ్ వార్ ఇన్సూరెన్స్' లేదు. యుద్ధం వల్ల ఆస్తులు దెబ్బతిన్నా వీరికి పరిహారం లభించదు. రవాణా ఖర్చులు: సముద్ర, వైమానిక మార్గాల్లో ఆటంకాలు కలగడంతో ఎగుమతి, దిగుమతి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఇది వారి లాభాలను పూర్తిగా హరించివేస్తోంది.

## విజయ్‌కు బీజేపీ తాజా ఆఫర్..!

### సీఎం సహా-బయటపెట్టిన పార్టీ నేత..!

**హైదరాబాద్, మార్చి 18:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలక (tamil nadu assembly election 2026) షెడ్యూల్ వచ్చేసింది. ఈసారి అధికార డీఎంకే కూటమికీ, విపక్ష అన్నాడీఎంకే-బీజేపీ కూటమితో పాటు రేసులో విజయ్ (ఎఱయిుఎ) పార్టీ టీవీకే (ంఎఖ) కూడా ఉంది. అయితే ఈ రేసును డీఎంకే-అన్నాడీఎంకే కూటముల మధ్య ముఖాముఖీగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీజేపీ.. విజయ్ కు తెరవెనుక ఆఫర్లు ఇస్తోంది. అయితే వీటిపై మౌనంగా ఉంటూ చర్చలు సాగిస్తున్న ఆ పార్టీ నేతలు తాజాగా బయటపడుతున్నారు. తమిళనాడు ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పార్టీ అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రి పదవితో పాటు 50 శాతం అసెంబ్లీ సీట్లను ఇస్తామని ఓ రాజకీయ పార్టీ ఆఫర్ చేసిందని టీవీకే ప్రధాన కార్యదర్శి ఆదవ్ అర్జున్ ప్రకటించారు. అయితే ఆ ప్రతిపాదనను విజయ్ తిరస్కరించినట్లు ఆయన స్పష్టం చేశారు. దీంతో ప్రస్తుతం టీవీకేతో చర్చలు జరుపుతున్న బీజేపీ యే ఈ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్‌కు రెండున్నర సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి పదవి, 50:50 నిష్పత్తిలో సీట్లు ఇస్తామని సదరు పార్టీ ముందుకు వచ్చిందని అర్జున్ తెలిపారు. పొత్తు చర్చలు జరిపిన ఆ పార్టీ పేరును మాత్రం ఆయన వెల్లడించలేదు. మరోవైపు తమ పార్టీ టీవీకేతో ఎలాంటి పొత్తు చర్చలు జరపడం లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి వెల్లడించారు. దీన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ కూడా సమర్థించారు. అధికార డీఎంకేను ఎదుర్కొనేందుకు బీజేపీ- టీవీకేతో పొత్తుకు ప్రయత్నించినట్లు ఊహా గానాల వేళ ఈ వ్యాఖ్యలు బయటికొచ్చాయి. నిన్న రాత్రి కొలత్తూర్‌లో జరిగిన టీవీకే సమావేశంలో అర్జున్ మాట్లాడుతూ, "విజయ్ ముఖ్యమంత్రి పదవి కోసం ఢిల్లీకి లొంగిపోయే వ్యక్తి కాదని, తమకు 50 నుంచి 90 సీట్ల వరకు అన్ని రకాల ఆఫర్లు వచ్చాయని తెలిపారు. విజయ్ కోరుకున్నదల్లా ముఖ్యమంత్రి పదవి కాదు, తమిళనాడు ప్రజల నమ్మకం మాత్రమే అన్నారు. టీవీకే ఒక బలమైన శక్తిగా ఎదుగుతుం దని, అన్ని 234 నియోజకవర్గాల్లో పోటీ చేసి లౌకిక సామాజిక న్యాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ సందేశాన్ని తన క్రిస్టియన్, ముస్లింస్నేహితులకుతెలియజేయాలనుకుంటున్నట్లుఅర్జున్ పేర్కొన్నారు.

## జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:** జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు మాట్లాడుతూ.. ఈ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు టి. సృజన, వి. వినాయక్ లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 8008429738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

balagamtv100@gmail.com

# అర్హులందరికీ 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి

**మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**



హైదరాబాద్, మార్చి 18: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాదికి 4.50లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమ లుకావడం లేదని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూద నాచారి పేర్కొన్నారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో డబుల్ ఇండ్ల కేటాయింపులపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చెప్పిన విధంగా ఇండ్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులకు కాకుండా కాంగ్రెస్ నాయకులకు ఇండ్లు కేటాయించడం వల్ల నిజమైన లబ్ధిదారులు కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గత బీఆర్ఎస్ హయాంలో ఇండ్లు పారదర్శకంగా కేటాయించామని గుర్తుచేశారు.సింగరేణి ప్రాంతంలో దుర్భర పరిస్థితులుఈ నెల మొదటి వారం నుంచే సింగరేణి ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని మధుసూదనాచారి తెలిపారు. బుధవారం శాసనమండలిలో జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. సింగరేణి పరీవాహక ప్రాంతంలో వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటడం, ఓపెన్‌కాస్ట్‌ల వల్ల వేడి, ఉకపోతతో బయటికి రాలేని పరిస్థితులున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభావిత పట్టణాలు, గ్రామాల్లో నిరంతరం వాటర్ స్ప్రే, నీటి సరఫరా టాంకర్ల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ఆర్టీఐ అమల్లో ప్రభుత్వం విఫలం: దాసోజు



హైదరాబాద్, మార్చి 18: పారదర్శకత అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, అదే పారదర్శకతకు మూలమైన సమాచార హకు చట్టం(ఆర్టీఐ యాక్ట్) అమలులో విఫలమైందని ఎమ్మె ల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. బుధవారం శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజలకు సమాచారం అందే వ్యవస్థలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. ఆర్‌టీఐ చట్టం ప్రకారం ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా ప్రత్యేక వెబ్‌సైట్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ దానిని నిర్వర్తించడం లేదని తెలిపారు. వెబ్‌సైట్‌లో చిన్నచిన్న బదిలీలు, జీవోలు మాత్రమే ఉంచి, ముఖ్యమైన టెండర్లు, నిధుల కేటాయింపులు వంటి కీలక జీవోలు 'క్లాసిఫైడ్' 'కాన్ఫిడెన్షియల్' పేరుతో ప్రజలకు తెలియకుండా దాచిపెట్టడం ఎందుకని నిలదీశా రు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వ వ్యవహారాలు ప్రజలకు తెలియకుండా పోతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

## గత యాసంగి కంటే అధిక యూరియా కొనుగోలు

**మండలి ప్రశ్నోత్తరాల్లో మంత్రి తుమ్మల వెల్లడి**

హైదరాబాద్, మార్చి 18: గత యాసంగి కంటే ఈసారి రైతులు 30 వేల టన్నుల యూరియాను అధికంగా కొనుగోలు చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వెల్లడించారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి తుమ్మల సమాధానమిస్తూ.. గత యాసంగిలో 10.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేస్తే, ఈ యాసంగి మార్చి 18 నాటికి 10.73 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారని తెలిపారు. రైతులు క్యూలైన్లలో నిలబడే పరిస్థితి ఉండొద్దనే ఉద్దేశంతోనే యూరియా యాప్‌ని తీసుకొచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా 20.74 లక్షల మంది రైతులు 88.35 లక్షల యూరియా సంచులను కొనుగోలు చేశారని, వీరిలో 17,926 మంది కౌలు రైతులు, 23,087 మంది ఎన్‌డీఎస్ రైతులు కూడా ఉన్నట్టు వివరించారు.

## ఒక వైపు తండ్రి చావు... మరో వైపు పరీక్ష

- బాధను గుండెల్లో దాచుకుని పరీక్ష హాలుకి వెళ్లిన చిన్నారి
- ఇంట్లో రోదనలు... చేతిలో పెన్ --

**హృదయ విదారక దృశ్యం**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో జరిగిన ఓ ఘటన ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తోంది. తండ్రి మృతి ఒక వైపు... భవిష్యత్తు అనే బాధ్యత మరోవైపు... ఈ రెండింటి మధ్యచిక్కుకుని ఓ చిన్నారి చూపిం చిన ధైర్యం అందరినీ కన్నీళ్లు పెట్టిస్తోంది.స్థానిక బీజేపీ నాయకుడు చందుపట్ల రాజిరెడ్డి గుండెపోటుతో అకాలంగా కన్నుమూశారు. ఇంట్లో తండ్రి రాజిరెడ్డి మృతదేహం ఉండగా, కుటుంబ సభ్యుల విలపనలు ఆగకముందే... రాజిరెడ్డి కుమారుడు అక్షిత్ రెడ్డి కి బుధవారం పదో తరగతి హిందీ పరీక్ష ఉండటంతో, కన్నీళ్లు ఆగకపోయినా... మనసు తట్టుకోకపో యినా... తండ్రి జ్ఞాపకాలను హృదయంలో పెట్టుకుని పరీక్ష రాయడానికి బయలుదేరాడు. తన సోదరితో మాట్లాడుతూనే కళ్లలోంచి జారిన కన్నీళ్లు అక్కడున్న ప్రతి ఒక్కరిని కదిలించాయి.ఈ విషాద సమయంలో అక్షిత్ చదువుతున్న విద్యాసంస్థ వ్యవస్థాపకుడు లతీఫ్ మానవత్వంతో ముందుకొచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ పరీక్ష అతని భవిష్యత్తుకు ఎంత ముఖ్యమో వివరించి, స్వయంగా పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు.

# అసెంబ్లీ వేదికగా అసహన ప్రదర్శన

- ప్రశ్నలకు సమాధానం లేక ప్రతిపక్షంపై సీఎం చిందులు
- ఉద్యమకారులను దూషించిన సీఎం
- బాబు, వైఎస్ దయాదాక్షిణ్యాలతో పదవులంటూ వ్యాఖ్యలు
- నెత్తి మీద కాలుపెట్టి తొక్కుతా, నా కాలిగోటికి సరిపోరు..అంటూ అనుచిత వ్యాఖ్యలు
- 3.47 లక్షల కోట్ల అప్పు చేసినట్టు ముఖ్యమంత్రి రేవంత్ ఒప్పుకోలు



హైదరాబాద్, మార్చి 18: అసెంబ్లీ వేదికగా అసహనంతో, అసందర్భ ప్రేలాపనలతో సీఎం రేవంత్ ప్రసంగం సాగింది. ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అడ్డగోలుగా చిందులు తొక్కా రు. ఉన్నతమైన శాసనసభలో ఉన్నామని, లైవ్ ద్వారా తెలంగాణ సమాజం అంతా చూస్తున్నదన్న విషయాన్ని మరచి, సీఎం స్థాయి నుంచి దిగజారి మాట్లాడారు. 'నెత్తి మీద కాలుపెట్టి తొక్కుకుంటూ వచ్చిన, 2029లో మళ్లీ తొక్కుకుంటూ పోత అంటూ సవాల్ విసిరారు. తొ క్కుతా.. నార చీరుతా.. నరుకుత, కుప్పలు పెడుత అంటూ ఊగిపోయారు. నోటికొచ్చిన రీతిలో దూషణలకు దిగారు. బుధవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రసంగించిన రేవంత్.. బీఆర్ఎస్ నేతలపై దుర్భాషలాడారు. రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘకాలం ఉద్యమించి, పదేండ్ల రాష్ట్రానికి దశా దిశను నిర్దేశించి, దేశంలోనే తెలంగాణను అన్నిరంగా ల్లో ఆదర్శంగా నిలిపిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై తిట్ల దండకం అందుకొన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లను ఎందుకు కూలగొడుతున్నారు? 6 గ్యారెంటీలను ఇప్పటివరకు ఎందు కు అమలు చేయలేదు? అని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్నించడాన్ని తట్టుకోలేక, అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక.. ఎప్పటి మాదిరిగానే సీఎం రేవంత్‌రెడ్డి తిట్ల దండకం అందుకొన్నారు. తెలంగాణ సభలో అనుచిత భాషకొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ నిండు అసెంబ్లీలోనే రేవంత్ ఆంధ్రా నేతలను ఆకాశానికి ఎత్తారు. తన గురువు చంద్రబాబు నాయుడును గొప్పగా కీర్తిస్తూ ఉద్యమ నేతలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నేతల పోరాటాన్ని కించపరిచేలా వ్యాఖ్యానించారు. రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు దయాదాక్షిణ్యాలతో ఉద్యమ నేతలు పదవులు పొందిన ట్టు, పాలమూరు ఎంపీగా కేసీఆర్‌ను తానే గెలిపించినట్టు అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు వల్లెవేశారు. తెలంగాణ ప్రజల తీర్పునే అవమానించేలా మాట్లాడారు. బుధవారం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో ఆయన తీవ్ర ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని, అందులో భాగమే దుర్భాషను ఆశ్రయించారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

# కేసీఆర్ కు జీతం కట్ పై సీఎం రేవంత్ నిర్ణయం



హైదరాబాద్, మార్చి 18: అసెంబీ సమావేశాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 1, 2023 నుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ 1 కోటి 6 లక్షల 56 వేల 674 రూపాయలు జీతభత్యాలు పొందారని అన్నారు. విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నానని తెలిపారు."అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వస్తారని అనుకున్నాం. కొత్త గవర్నర్ కు శుభాకాంక్షలు చెబుతారని భావించాం. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదు. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా... కొందరిలో రాచరిక పోకడలు మాత్రం పోలేదు. కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకుంటున్నారు" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు."కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. ప్రజలే తప్పు చేశారని అనుకుంటున్నారు. నియంత పోకడలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి ప్రదర్శించారు. ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా ప్రవర్తిస్తున్నారు" అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు."తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిభింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్ ను ఆవిష్కరిస్తూ... రాష్ట్ర గవర్నర్ గౌరవ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారు ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగం చరిత్రాత్మకం. ఆయన చేసిన ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదు. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అవసరమైన విశిష్ట ప్రణాళిక. అటువంటి గొప్ప సంకల్పాన్ని, పవిత్ర శాసన సభ వేదిక నుండి రాష్ట్ర ప్రజల ముందు ఉంచిన గవర్నర్ శుక్లా గారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు."గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని గవర్నర్ ప్రసంగంలో వివరించారు.సంక్షోభ సమయంలో దేశ ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టారు. ఆయన తీసుకున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ పరిస్థితుల్లో ఉంది. మొదటి తరంలో నెహ్రూ- ఇందిరా గాంధీ గొప్ప విధానాలు తీసుకువచ్చారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గతిని మార్చిన ఘనత పీవీ నరసింహారావుది. 1990 నుంచి 2020 వరకు 30 ఏండ్లు పీవీ నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారు" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు."భవిష్యత్ లో ~ా× సునామీ రాబోతుంది. దీనిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్ ను గవర్నర్ గారి ప్రసంగంలో వివరించారు. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను కనీసం చదివారా? చూశారా..? గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించకపోతే తరువాతి తరాలు మనల్ని క్షమించవు. ఇది నవశకానికి నాంది పలుకాల్సిన సమయం. అధికారం కోల్పోయామన్న దుఃఖమే తప్ప ప్రభుత్వానికి సహకరించాలన్న ప్రధాన ప్రతిపక్షానికి ఆలోచన లేదు" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు."అందుకే ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించుకున్నాం. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ గా విభజించుకున్నాం. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆక్రమణలను నిర్ధాక్షిణ్యంగా కొట్టిపారేయాలని మాట్లాడారు. అప్పుడు సక్రమం అని చెప్పిన వాళ్లకు ఇప్పుడు అక్రమం ఎలా అయింది?మీరు మాట్లాడిన మాటలను ప్రజలు అప్పుడే మర్చిపోయారనుకున్నారా? మూసీ ఉప్పల్ భగాయత్ లో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చూసొద్దాం రండి. ఎవరెవరు ఎక్కడ ఆక్రమించుకున్నారో ఒక నిజ నిర్ధారణ కమిటీ వేద్దాం.." అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు."కాలుష్య నియంత్రణలో భాగంగా ఈవీ వాహనాలు కొనుగోలు చేసేవారికి పన్ను మినహాయించాం. త్వరలో క్యూర్ పరిధిలోని ఆటోలను ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నాం. మన నగరాన్ని మనం పరిరక్షించుకోకపోతే, చెరువులను పునరుద్ధరించుకోకపోతే భవిష్యత్ తరం మనల్ని క్షమించదు" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# విమాన ప్రయాణికులకు భారీ గుడ్ న్యూస్



హైదరాబాద్, మార్చి 18: విమానయాన రంగంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మేరకు పౌర విమానయాన సంస్థలకు కేంద్రప్రభుత్వం తాజా ఆదేశాలు ఇచ్చింది. కనీసం 60 శాతం విమాన సీట్లను ఉచితంగా కేటాయించాలని సూచించింది. ఈ నిర్ణయం- విమాన ప్రయాణికులకు ఉపశమనం కలిగించినట్టే. అదనపు ఛార్జీల భారం ప్రయాణికులపై ఉండదు. తాజా ఆదేశాలతో సివిల్ ఏవియేషన్ ఇండస్ట్రీలో మాత్రం ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం తీసుకున్న తాజా చర్యల వెనుక సీట్ల ఎంపిక ఛార్జీల కట్టడి ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది. బుకింగ్ లేదా వెబ్ చెక్-ఇన్ సమయాలలో సీట్ల కోసం వసూలు చేసే అధిక ధర విధానానికి ఇది తెరదించుతుంది. 60 శాతం సీట్లను ఉచితంగా ఉంచడం ద్వారా అందరికీ సమాన ప్రాధాన్యతను కల్పించినట్టవుతుంది. ప్రయాణికుల అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించినట్టవుతుంది. దీంతో పాటు పలు మార్పులు చేసింది పౌర విమానయాన మంత్రిత్వ శాఖ. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (ణ+జూా) ఆదేశాల మేరకు ఒకే పీఎన్ఆర్ కింద బుక్ చేసుకున్న ప్రయాణికులను పక్కపక్క సీట్లలో కూర్చోబెట్టాలి. ఇది కుటుంబ సభ్యులు, గుంపుగా ప్రయాణాలు సాగించే వారికి అనుకూలం. వారికి మరింత సౌకర్యాన్ని కల్పించినట్టవుతుంది. పెంపుడు జంతువులు, క్రీడా/సంగీత పరికరాల రవాణాకు భద్రతా నిబంధనల మేరకు స్పష్టమైన, పారదర్శక విధానాలను ఎయిర్‌లైన్‌లు అనుసరించాలి. క్రికెట్, టెన్నిస్ వంటి కిట్స్, ఇతర క్రీడా సామాగ్రి, సంగీత వాయిద్య పరికరాలను పారదర్శకంగా, ప్రయాణికులకు అనుకూలమైన పద్ధతిలో రవాణా చేసే సౌలభ్యాన్ని ఎయిర్‌లైన్స్‌ను కల్పించాలి. విమాన ఆలస్యం, రద్దు, ప్రవేశం నిరాకరణ సందర్భాలలో ప్రయాణికులకు అదనపు ప్రయోజనాలను కూడా కల్పించేలా కేంద్రం తాజా ఆదేశాలను రూపొంచింది. దీనివల్ల ప్రయాణికులపై అదనపు భారాన్ని తగ్గించడంతో పాటు మరింత మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినట్టవుతుంది. ఈ ఆదేశాలన్నింటినీ కూడా విమానయాన సంస్థలు తమ ఫ్లైట్ బుకింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు, ఇతర ప్లాట్‌ఫామ్‌లు, ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లలో ప్రముఖంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇంగ్లీష్ తో పాటు ప్రాంతీయ భాషలలో కూడా వీటిని తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుంది. ఎంక్వైరీ కౌంటర్ లల్లో కూడా మౌఖికంగా ప్రయాణికులు వీటి గురించి అడిగినప్పుడు వివరంగా తెలియజేయాల్సి ఉంటుంది అక్కడి సిబ్బందికి.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో తృటిలో తప్పిన పెను ప్రమాదం..

**సిఎన్జీ కారు అగ్నికి ఆహుతి, యజమాని సురక్షితం**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన రుచి చికెన్ సెంటర్ యజమాని శ్రీనివాస్ గౌడ్ ప్రయాణిస్తున్న సిఎన్జీ కారు మాచారెడ్డి సమీపంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.సమాచారం ప్రకారం, శ్రీనివాస్ గౌడ్ తన చికెన్ సెంటర్ బ్రాంచ్‌ల నిర్వహణ కోసం వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ఒక్కసారిగా మంటలు రావడంతో అప్రమత్తమైన ఆయన వెంటనే బయటకు దిగి ప్రాణాలతో బయట పడ్డారు. కారు పూర్తిగా కాలిపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.ఘటనపై స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతం

**99.85శాతం మంది హాజరు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మార్చ్ 2026లో జరుగుతున్న ాాజ పబ్లిక్ పరీక్షలు రెండవ రోజు (మార్చ్ 18, బుధవారం) ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని మొత్తం 34 పరీక్షా కేంద్రాల్లో 7,308 మంది విద్యార్థులకు గాను 7,297 మంది హాజరై 99.85 శాతం హాజరు నమోదైంది. కేవలం 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాధికారి 5 కేంద్రాలను సందర్శించగా, రాష్ట్ర పరిశీలకులు టి.శ్రీనివాసులు 6కేంద్రాలను పరిశీలించారు.అదనంగా, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్‌బృందాలు8 కేంద్రాలను తనిఖీ చేశాయి.అయితే, సిరిసిల్ల పట్టణంలోని ఒక పరీక్షా కేంద్రంలో పరీక్ష అనంతరం ఒక ఇన్విజిలేటర్ వద్ద మొబైల్ ఫోన్ గుర్తించబడింది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటూ ఆ ఇన్విజిలేటర్‌ను విధుల నుండి తొలగించి శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సంఘటన మినహా రెండవరోజు పరీక్ష సజావుగా సాగిందని జిల్లా విద్యాధికారి డా. బి. జగన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి..



**కంచర్ల రవి గౌడ్ డిమాండ్.**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాల కోసం కనీసం లక్ష కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో పెద్దఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను పూర్తిగా మోసం చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక బీసీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించిన మహానాయకుడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బడ్జెట్‌లో బీసీలకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు బిచ్చగాళ్లు కాదని, వారికి రావాల్సిన హక్కు వాటాను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని స్పష్టం చేశారు. బీసీలకు అన్యాయం కొనసాగితే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, అరేవెల్లి వినయ్ కుమార్, నవీన్, విష్ణు, షాద్, శేఖర్, జమీర్, రమేష్, అజిత్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీకాల తనిఖీలు నిర్వహించిన డాక్టర్ ఎస్. రజిత



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రజిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీల లో భాగంగా ఎల్లారెడ్డి పేట మండలంలోని బొప్పాపూర్, ఉప కేంద్రాలను, గంభీరావుపేట మండలంలోని లింగన్న పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ముస్తాబాద్ మండలంలోని పోతుగ ల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో వ్యాక్సిన్ నిలువలను వ్యాక్సిన్ క్యారియర్లు శీతలీకరణ పరిశీలించి, టీకా ఇచ్చిన వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాల్సిందిగా సూచిస్తూ, ఉపకేంద్ర పరిధిలో గల 0-5 సంవత్స రాల పిల్లలకు సరైన కాలంలో టీకాలు ఇప్పించవల సిందిగా, కేంద్ర ఆరోగ్య పథకాల నిర్దేశిత లక్ష్యాలు సాధించవలసిందిగా వైద్య సిబ్బందికి దిశా నిర్దేశించినారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో గంభీరావుపేట పర్యటనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సీఎస్ రామకృష్ణా రావుకు మరో మూడు నెలల పొడిగింపు



- కేంద్ర డీఓపిటి నిర్ణయం
- జూన్ నెలాఖరు వరకు పదవిలో కొనసాగింపు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. కేంద్ర హోం శాఖ పరిధిలోని పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపిటి) ఈ మేరకు నిర్ణయం తీసుకుని రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక సమాచారం పంపింది. తాజా నిర్ణయంతో రామకృష్ణా రావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

గతేడాది ఆగస్టు 31న ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉండగా, సేవలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. దీనిపై స్పందించిన డీఓపిటి ఆయన సేవలను ఏడునెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 31తో ఆ గడువు ముగియనున్న నేపథ్యంలో మరోసారి పదవీకాలం పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయగా, కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో పరిపాలనా వ్యవహారాల్లో నిరంతరత కొనసాగించాలనే ఉద్దేశంతో సీఎస్‌గా రామకృష్ణా రావు మరో మూడు నెలలు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## రాజకీయాల్లో విరమణ ఉండదు



### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
### రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యులకు ఘన వీడ్కోలు

**బలగం టీవి, న్యూఢిల్లీ**

రాజకీయాలు, ప్రజాసేవలో ఉన్న నాయకులకు విశ్రాంతి లేదా విరమణ అంటూ ఉండదని రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభ పదవీకాలం ముగించుకుంటున్న సభ్యులకు ఆయన ఘనంగా వీడ్కోలు పలికారు. మాజీ ప్రధాని హెచ్ డీ దేవెగౌడతో తనకు 54 ఏళ్ల అనుబంధం ఉందని ఖర్గే గుర్తు చేసుకున్నారు. ఎంతోకాలం కలిసి పనిచేశామని, జీవితంలో రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయో చెప్పడం కష్టమని వ్యాఖ్యానించారు. ఇదే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రిటైర్ అవుతున్న సభ్యులకు వీడ్కోలు తెలిపారు. రాజ్యసభ సభ్యులుగా వారు అందించిన సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో ఫుల్‌స్టాప్‌లు ఉండవని, భవిష్యత్తులో కూడా వారు ప్రజాసేవలో కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సభలో చర్చల సమయంలో ప్రతి సభ్యుడు విశిష్ట పాత్ర పోషిస్తారని, ఇటువంటి సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా పరస్పర గౌరవ భావం వ్యక్తమవుతుందని మోదీ పేర్కొన్నారు. సీనియర్ నేతలు దేవెగౌడ, ఖర్గే, శరద్ పవార్ వంటి వారు తమ జీవితకాలంలో పెద్ద భాగం పార్లమెంటరీ కార్యకలాపాలకు అంకితం చేశారని అన్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు వారి అనుభవాల నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సూచించారు. రాజ్యసభ సభ్యుడు రాందాస్ అథవాలే హాస్య చతురత, వ్యంగ్య వ్యాఖ్యలను ప్రత్యేకంగా ప్రస్తావించిన మోదీ.. ఆయన సభ నుంచి వెళ్లిపోతున్నప్పటికీ రాజకీయ వేదికలపై తన ప్రత్యేక శైలి కొనసాగుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. మొత్తం 37 మంది సభ్యులు ఈసారి పదవీ విరమణ చేస్తున్నారు. వీరిలో ప్రియాంక చతుర్వేది, తిరుచి శివ, అభిషేక్ మను సంఘ్వి తదితరులు ఉన్నారు. పది రాష్ట్రాలకు చెందిన ఈ స్థానాలను భర్తీ చేసేందుకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో 26 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



### ముంద్రా పోర్టుకు
## సురక్షితంగా చేరిన 'జగ్ లాడ్కి' చమురు నౌక

### పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య 80 వేల టన్నుల ముడి చమురు భారత్‌కు రవాణా

**బలగం టీవి, హైదరాబాద్**

భారత జెండా కలిగిన 'జగ్ లాడ్కి' అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్కు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఫుజైరా పోర్ట్ నుంచి బయలుదేరిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. 'జగ్ లాడ్కి' నౌక పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ముర్బన్ క్రూడ్‌తో నిండి మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది.

ఇరాన్--అమెరికా, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో ఇంధన సరఫరాలపై ఆందోళనలు నెలకొన్నాయి. అయితే దేశంలో తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. మార్చి 14న ఫుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై జరిగిన దాడి సమయంలో 'జగ్ లాడ్కి' అక్కడే ఇంధనం నింపుకుంటోంది. అనంతరం సురక్షితంగా బయలుదేరి భారత్ చేరుకోవడం గమనార్హం. ఇప్పటికే 'శివాలిక్', 'నందాదేవి' నౌకలు కూడా హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించి ఎల్పీజీ గ్యాస్‌తో భారత్ చేరుకున్నాయి. సముద్ర మార్గంలో జరిగే ప్రపంచ చమురు రవాణాలో సుమారు ఐదవ వంతు ఈ జలసంధి ద్వారానే జరుగుతుండటం తెలిసిందే.

## ఉద్యోగం రాదేమోనన్న ఆందోళనతో యువతి ఆత్మహత్య



**బలగం టీవి, ఖమ్మం**

ఉద్యోగం రాదేమోనన్న ఆందోళనతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దార్‌పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం, గ్రామానికి చెందిన ఉన్నం భవాని (25) పీజీ వరకు చదువుకుని కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగ అవకాశాలపై నిరాశకు గురై తీవ్ర మనస్తాపానికి లోనైన ఆమె మంగళవారం ఉదయం ఇంట్లో గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని సూచించడంతో ఆమెను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆస్తికోసం అక్కను చంపిన తమ్ముడు



**బలగం టీవి, హైదరాబాద్**

ఆస్తికోసం తోడబుట్టిన అక్కను కడతేర్చిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లీలావతి హైదరాబాద్ నగరానికి వలస వచ్చి ఎన్‌టీఆర్ నగర్‌లో నివాసం ఉంటూ తన కుటుంబాన్ని పోషించుకుం టున్నారు. ఈ క్రమంలో భర్త చనిపోడంతో లీలావతి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఏడాది క్రితం నుంచి అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాటసింగారం గ్రామంలో తన తమ్ముడు (నిందితుడు)తో కలిసి నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరూ కలిసి ఓ ప్లాట్ కొనుగోలు చేసి, తమ్ముడు పప్పు రామ్ కుమావత్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. కొనుగోలు చేసిన ప్లాట్‌లో తన వాటా ఇవ్వాలని అక్క తన తమ్ముడిపై వత్తిడి తెచ్చింది. అయితే ప్లాట్ లో అక్కకు వాటా ఇవ్వకుండా తమ్ముడు పబ్బం గడుపుతూ వచ్చాడు. వాటా అడుగుతున్న అక్కను ఎలాగైనా అంతమెందించాలని నిందితుడు పప్పు రామ్ కుమావత్, రాకేష్ కుమావత్, సునీల్ కుమార్‌తో కలిసి లీలావతిని గత నెల 28వ హత్య చేశారు. మృతదేహాన్ని బ్యాగ్‌లో కుక్కి, కాళ్లు వేరు చేసి కియా కారులో తరలించి మజీద్ పూర్ గ్రామం పరిధిలోని పెద్ద చెరువులో పడేశారు. ఏమీ తెలియనట్టు ఈ నెల 8న తన అక్క మిస్సింగ్ అయినట్టు పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా బుధవారం మృతురాలి తమ్ముడు పప్పు రామ్ కుమావత్ మరో ఇద్దరు రాకేష్ కుమావత్, సునీల్ కుమార్‌ను అదుపులో తీసుకొని విచారించగా లీలావతిని హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**భవ్య పథకానికి ఆమోదం**
**ఇండస్ట్రియల్ పార్కులు, జాతీయ రహదారులు, చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులకు నిధులు**



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద రూ.33,600 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా 100 ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయనున్నారు. 100 నుంచి 1000 ఎకరాల పరిధిలో ప్రభుత్వ--ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ పార్కుల నిర్మాణం చేపట్టనున్నారు.

భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడం, దేశంలో తయారైన ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా విక్రయించడమే లక్ష్యంగా ఉన్న మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ఇది విస్తృత రూపమని మంత్రి తెలిపారు.

**ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్**

ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

**జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు**

ఉత్తరప్రదేశ్‌లో బారాబంకి నుంచి బహ్రైచ్ వరకు 101 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్ జాతీయ రహదారి నిర్మాణానికి రూ.6,969 కోట్ల వ్యయంతో ఆమోదం తెలిపింది.

**పత్తి రైతులకు ఊరట**

పత్తి గిట్టుబాటు ధరల నిధికి రూ.1,718 కోట్ల రీయింబర్స్‌మెంట్‌కు కూడా కేబినెట్ అనుమతి ఇచ్చింది. 2023--24 పత్తి సీజన్‌లో కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) అమలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. మార్కెట్ ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర అందేలా కేంద్రం భరోసా కల్పించిందన్నారు.

చిన్న జలవిద్యుత్ అభివృద్ధి పథకానికి రూ.2,585 కోట్ల కేటాయింపుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా సుమారు 1,500 మెగావాట్ల సామర్థ్యం గల చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలకు ఈ పథకం ద్వారా అధిక ప్రయోజనం కలుగుతుందని మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

## రూ. 600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా..!



**బలగం టీవి, హైదరాబాద్**

నగరం నడిబొడ్డున ఖైరతాబాద్ మండలం వెంగళరావునగర్‌లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో దీని విలువ రూ. 600ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. 1975 కంటే ముందే సంబంధిత వ్యక్తులకు పరిహారం ఇచ్చి 45 ఎకరాల భూమని హౌసింగ్ బోర్డు సేకరించింది. మొత్తం 660 ప్లాట్లతో లే ఔట్ వేసింది. ఇందులో పార్కులకోసం కొన్ని స్థలాలను కేటాయించింది. వెంగళరావునగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ప్రజావసరాలకోసం 5 ఎకరాల స్థలాన్ని ఖాళీగా ఉంచింది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాల వరకూ ఆక్రమణలు జరిగి శాశ్వత కట్టడాలు వచ్చాయి. వాటి జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా బుధవారం కాపాడింది. హౌసింగ్ బోర్డు నుంచి గతంలో పరిహారం తీసుకున్నవారితో పాటు మరో 3 గ్రూపులు ఈ భూమి వారిదిగా చెబుతూ ఆక్రమణలకు పాల్పడిన వారితో హైడ్రా సమావేశం ఏర్పాటు చేసింది. ఎవరి వద్దా సరైన పత్రాలు లేవని నిర్ధారించింది. ఇదే సమయంలో ఆ ఖాళీ స్థలం వారిదిగా పేర్కొంటున్న వారు హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఈ విషయంలో హైకోర్టు స్టే ఇచ్చింది. స్టే కొనసాగుతున్నప్పుడు అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించరాదనే నిబంధనలు పట్టించుకోకుండా అందులో కొత్తగా షెడ్డులు వేయడం, గుడిసెలు నిర్మించడం, వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ రావడంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో హైడ్రా బుధవారం ఆక్రమణలను తొలగించింది. 3 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## పేదల ఎల్-వన్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలి



**బలగం టీవి, హైదరాబాద్**

సొంత స్థలం ఉండి గృహ నిర్మాణం కోసం 'ఎల్-వన్'(ఎల్-1) పథకం కింద దరఖాస్తు చేసుకున్న పేదలందరినీ అర్హత మేరకు పరిశీలించి, వారికి సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గృహ నిర్మాణ పథకాలపై జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఈ. వెంకటాచారి, హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తిలతో కలిసి ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలు సమర్పించిన ఎల్-వన్ దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని, ఆయా ప్రాంతాలను పరిశీలించి సమగ్ర నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం కేటాయించిన 2బీహెచ్‌కే ఇండ్లలోకి లబ్దిదారులు ఇంకా వెళ్లలేదని, ఇండ్లు ఖాళీగా ఉంటున్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఆ కుటుంబాలకు అధికారులు తక్షణమే నోటీసులు జారీ చేసి, వారు గృహాల్లోకి వెళ్లేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మురికివాడల్లో నివసించే పేదల కోసం గృహ సముదాయాలను నిర్మించడానికి అనువైన స్థలాలను గుర్తించాలని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కాలం చెల్లిన పాత హౌసింగ్ కాలనీలను గుర్తించి, వాటి పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. పేదలకు సొంత గూడు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పారదర్శకంగా, వేగంగా పని చేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సాయిరాం, రామకృష్ణ, తహసీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**2బీహెచ్‌కే కాలనీల్లో 99 దుకాణాల బహిరంగ వేలం**

జిల్లాలోని 2బీహెచ్‌కే కాలనీల్లో నిర్మించిన 99 దుకాణాలను బహిరంగ వేలం పద్ధతిలో విక్రయించేందుకు అవసరమైన విధివిధానాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని, ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఈ. వెంకటాచారి, హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తిలతో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ పది 2బీహెచ్‌కే కాలనీలకు సంబంధించి మొత్తం 99 దుకాణాలను పారదర్శకంగా వేలం వేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓపెన్ మార్కెట్ వేలం నిర్వహించేందుకు కచ్చితమైన విధివిధానాలను రూపొందించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ప్రస్తుత రిజిస్ట్రేషన్, మార్కెట్ ధరలను ప్రాతిపదికగా తీసుకుని దుకాణాలకు కనీస ధరను నిర్ణయించి, ఆ ప్రతిపాదనలను సమర్పించాలని ఆదేశించారు. వేలంలో పాల్గొనే విక్రయదారుల నుంచి కనీసం 3 నుంచి 10 శాతం వరకు హామీ సొమ్మును ముందస్తుగా జమ చేసుకునేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు లోబడి వేలం ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, ఎస్టేట్ అధికారులు, సబ్ రిజిస్ట్రర్లు, తహశీల్దార్లు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 2028 నాటికి హ్యామ్ రోడ్ల నిర్మాణం పూర్తి



### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**

2028 జూన్ నాటికి తెలంగాణ దేశానికి మోడల్‌గా నిలిచేలా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు రూ.30 వేల కోట్ల వ్యయంతో హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే దాదాపు రూ.17 వేల కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఏప్రిల్ 10 నాటికి అగ్రిమెంట్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

రహదారులు రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన సూచికలని, పేదల ఇంటి ముందు రోడ్డు ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎంఎల్ఏలు టి హరీష్ రావు, సునీత లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు హ్యామ్ రోడ్ల నిర్మాణం జరుగుతుందని, టెండర్లు పూర్తికాకముందే ఆరోపణలు చేయడం సరికాదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ కాలంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా సుమారు రూ.4,600 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంచారని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. ???

## ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభానికి కేటీఆర్‌కు ఆహ్వానం

### నర్మెటలో రూ.300 కోట్లతో రాష్ట్రంలో తొలి రిఫైన్డ్ పామాయిల్ కర్మాగారం

**బలగం టీవి, హైదరాబాద్**



లిలిహైదరాబాద్/సిద్దిపేట:లిలి

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో టిజి ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆయిల్‌పామ్ కర్మాగారం ప్రారంభోత్సవానికి రావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కోరారు. బుధవారం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఛాంబర్‌కు స్వయంగా వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 22న సిద్దిపేట జిల్లా నర్మెట శివారులో 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన రాష్ట్రంలోనే తొలి రిఫైన్డ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఈ కర్మాగారం ద్వారా ఆయిల్‌పామ్ పండ్ల గుజ్జు నుంచి ముడి నూనె తీసి రిఫైన్డ్ చేసి ప్యాకెట్ల రూపంలో నేరుగా మార్కెట్‌కు పంపే ఏర్పాట్లు చేశారు. ఫ్యాక్టరీలో 10 కోట్ల లీటర్ల నిల్వ సామర్థ్యం గల నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆయిల్‌పామ్ గెలల నుంచి వెలువడే బయోమాస్ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి 4 మెగావాట్ల సామర్థ్యం గల సెల్ఫ్ జనరేషన్ ప్లాంట్‌ను నిర్మించారు. ఒక్క యూనిట్‌కు సుమారు రూ.1.50 ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికారులు తెలిపారు. ఇక్కడ వాడిన నీటిని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా రీసైక్లింగ్ చేసే సదుపాయం కూడా ఉంది. ప్రారంభ దశలో గంటకు 30 టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యం ఉండగా, అవసరాన్ని బట్టి దాన్ని గంటకు 120 టన్నుల వరకు పెంచుకునేలా ఫ్యాక్టరీ నిర్మించారు. ఈ స్థాయి క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ నిర్మాణం దేశంలో తొలిసారిగా చేపట్టిన ప్రాజెక్టుగా పేర్కొంటున్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిశీలన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ గరిమ అగ్రవాల్? బుధవారం పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఏ ఏ సేవలు అందుబాటులో ఉన్నాయో వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఇన్ పేషెంట్ వార్డులు, మందులు ఇచ్చే గది, స్టోర్ రూమ్, వ్యాక్సినేషన్ గది, ఎక్స్ రే గది, యునాని హాస్పిటల్, ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓకు సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు



మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, జిల్లా వైద్య అధికారి రజిత, డీసీ హెచ్ ఎస్ రవీందర్, సర్పంచ్ మల్లుగారి పద్మ, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, డాక్టర్ సృజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో తృటిలో తప్పిన పెను ప్రమాదం..

## సిఎన్జీ కారు అగ్నికి ఆహుతి, యజమాని సురక్షితం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఒక పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన రుచి చికెన్ సెంటర్ యజమాని శ్రీనివాస్ గౌడ్ ప్రయాణిస్తున్న సిఎన్జీ కారు మాచారెడ్డి సమీపంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.

సమాచారం ప్రకారం, శ్రీనివాస్ గౌడ్ తన చికెన్ సెంటర్ బ్రాంచ్‌ల నిర్వహణ కోసం వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కారులో ఒక్కసారిగా మంటలు రావడంతో అప్రమత్తమైన ఆయన వెంటనే బయటకు దిగి ప్రాణాలతో బయటపడ్డారు. కారు పూర్తిగా కాలిపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

# బాధితుల వద్దకే ఆన్సైట్ ఎఫ్ఐఆర్ ద్వారా కేసుల నమోదు..



- సంఘటనా స్థలంలోనే ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్
- జిల్లాలో ఇప్పటివరకు 12 కేసులు నమోదు..
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసిందని జిల్లా ఎస్పీ తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే "ఆన్సైట్ ఎఫ్ఐఆర్" విధానాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. నేరం జరిగిన తరువాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఒక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ విధానం అమలులో ఉందని తెలిపారు. ఇప్పటికే ఈ విధానం ద్వారా జిల్లాలో 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల వద్ద నుంచే ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదుదారులు డయల్ 100కు కాల్ చేసినా, నేరుగా సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించి ట్యాబ్‌ల ద్వారా ఆన్లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు.రోడ్డు ప్రమాదాలు, గొడవలు వంటి ఘటనల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసాయం అందిస్తూ ఆసుపత్రికి తరలిస్తారు. ఈ ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానం ద్వారా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దొంగతనాలు, భార్యాభర్తల వివాదాలు, వేధింపులు, అనుమానాస్పద మృతులు వంటి కేసులను సంఘటనా స్థలంలోనే తక్షణం నమోదు చేసే అవకాశం కలుగుతుంది.ఈ విధానం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందించడమే కాకుండా, పోలీస్ సేవలపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.



# ఒక వైపు తండ్రి చావు... మరో వైపు పరీక్ష

- బాధను గుండెల్లో దాచుకుని పరీక్ష హాలుకి వెళ్లిన చిన్నారి
- ఇంట్లో రోదనలు... చేతిలో పెన్ -- హృదయ విదారక దృశ్యం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో జరిగిన ఓ ఘటన ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తోంది. తండ్రి మృతి ఒక వైపు... భవిష్యత్తు అనే బాధ్యత మరోవైపు... ఈ రెండింటి మధ్య చిక్కుకుని ఓ చిన్నారి చూపించిన ధైర్యం అందరినీ కన్నీళు పెట్టిస్తోంది.

స్థానిక బీజేపీ నాయకుడు చందుపట్ల రాజిరెడ్డి గుండెపోటుతో అకాలంగా కన్నుమూశారు. ఇంట్లో తండ్రి రాజిరెడ్డి మృతదేహం ఉండగా, కుటుంబ సభ్యుల విలపనలు ఆగకముందే... రాజిరెడ్డి కుమారుడు అక్షిత్ రెడ్డి కి బుధవారం పదో తరగతి హిందీ పరీక్ష ఉండటంతో, కన్నీళ్లు ఆగకపోయినా... మనసు తట్టుకోకపోయినా... తండ్రి జ్ఞాపకాలను హృదయంలో పెట్టుకుని పరీక్ష రాయడానికి బయలుదేరాడు. తన సోదరితో మాట్లాడుతూనే కళ్లలోంచి జారిన కన్నీళ్లు అక్కడున్న ప్రతి ఒక్కరిని కదిలించాయి. ఈ విషాద సమయంలో అక్షిత్ చదువుతున్న విద్యాసంస్థ వ్యవస్థాపకుడు లతీఫ్ మానవత్వంతో ముందుకొచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ పరీక్ష అతని భవిష్యత్తుకు ఎంత ముఖ్యమో వివరించి, స్వయంగా పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు

- 99.85% హాజరు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మార్చ్ 2026లో జరుగుతున్న SSC పబ్లిక్ పరీక్షలు రెండవ రోజు (మార్చ్ 18, బుధవారం) ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని మొత్తం 34 పరీక్షా కేంద్రాల్లో 7,308 మంది విద్యార్థులకు గాను 7,297 మంది హాజరుకాగా 99.85 శాతం హాజరు నమోదైంది. కేవలం 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాధికారి 5 కేంద్రాలను సందర్శించగా, రాష్ట్ర పరిశీలకులు టి. శ్రీనివాసులు 6 కేంద్రాలను పరిశీలించారు. అదనంగా, రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 8 కేంద్రాలను తనిఖీ చేశాయి. అయితే, సిరిసిల్ల పట్టణంలోని ఒక పరీక్షా కేంద్రంలో పరీక్ష అనంతరం ఒక ఇన్విజిలేటర్ వద్ద మొబైల్ ఫోన్ గుర్తించబడింది. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటూ ఆ ఇన్విజిలేటర్‌ను విధుల నుండి తొలగించి శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన మినహా రెండవరోజు పరీక్ష సజావుగా సాగిందని జిల్లా విద్యాధికారి డా. బి. జగన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఎల్‌పీజీ గ్యాస్ కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు మాట్లాడుతూ ఈ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించేందుకు టి. సృజన, వి. వినాయక్ లు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 8008429738 ఫోన్ నంబర్‌కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని తెలిపారు.

జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతో పాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు.కంట్రోల్ రూమ్‌లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు చెరో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెలువరించారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, 09-12-2023న సిరిసిల్ల పట్టణ పరిధిలో గవర్నమెంట్ సివిల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కట్ట సుభాషిణి నివాసంలో నగదు దొంగతనం జరిగింది. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరిసిల్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితులు గంద్ర నవీన్, దండు సతీష్‌గా గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు.ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ నరేష్ సాక్షులను కోర్టు ముందుకు హాజరుపరిచారు.కేసులోని సాక్ష్యాధారాలు మరియు సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితులు గంద్ర నవీన్, దండు సతీష్‌ను దోషులుగా తేల్చి చెరో మూడేళ్ల కారాగార శిక్ష విధించారు.

# బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి

- కంచర్ల రవి గౌడ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ వర్గాల కోసం కనీసం లక్ష కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎన్నికల సమయంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో పెద్దఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను పూర్తిగా మోసం చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక బీసీలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించిన మహానాయకుడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీలకు నిజమైన న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బడ్జెట్‌లో బీసీలకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు బిచ్చగాళ్లు కాదని, వారికి రావాల్సిన హక్కు వాటాను ప్రభుత్వం వెంటనే




ఇవ్వాలని స్పష్టం చేశారు. బీసీలకు అన్యాయం కొనసాగితే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్ అరే వెళ్ళి వినయ్ కుమార్ నవీన్ విష్ణు షాద్ శేఖర్ జుమీర్ రమేష్ అజిత్ రాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు



## పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్థానిక 34వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దార్ల సందీప్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ వారి పండుగల సందర్భంగా సహకార కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. అదే ఆలోచనలకు అనుగుణంగా రంజాన్ నెలలో ముస్లిం కుటుంబాలకు తోఫాలను అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇతరులకు సహాయం చేయడం ద్వారా దాతృత్వ భావన పెంపొందుతుందని, అల్లా చూపిన మంచి మార్గాన్ని అనుసరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న సిరిసిల్ల జిల్లాలో టీకాల కార్యక్రమం తనిఖీలు నిర్వహించిన డాక్టర్ ఎస్. రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.రజిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీల లో భాగంగా ఎల్లారెడ్డి పేట మండలంలోని బొప్పాపూర్, ఉప కేంద్రాలను, గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ముస్తాబాద్ మండలంలోని పోతుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో వ్యాక్సిన్ నిలువలను వ్యాక్సిన్ క్యారియర్ను శీతలీకరణ పరిశీలించి, టీకా ఇచ్చిన వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాల్సిందిగా సూచిస్తూ, ఉపకేంద్ర పరిధిలో గల 0-5 సంవత్సరాల పిల్లలకు సరైన కాలంలో టీకాలు ఇప్పించవలసిందిగా, కేంద్ర ఆరోగ్య పథకాల నిర్దేశిత లక్ష్యాలు సాధించవలసిందిగా వైద్య సిబ్బందికి దిశా నిర్దేశించినారు. అనంతరం జిల్లా కలెక్టర్ తో గంభీరావుపేట పర్యటనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.




## అనంతారం గ్రామంలో యువ మండల్ వికాస్ అభియాన్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

గ్రామీణ యువతను ఏకం చేసివారిని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా 'మై భారత్ రాజన్న సిరిసిల్ల, శ్రీకృష్ణ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అనంతరం గ్రామంలో "యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమాన్ని 5 రోజులలో 50 గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో యువజన నాయకులకు యూత్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా డివైఓ వెంకట రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న యువజన సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం అని తెలిపారు. ఇప్పటివరకు యువజన సంఘాలు లేని ప్రాంతాల్లో నూతన. సంఘాలను ఏర్పాటు చేసి, వారిని 'మై భారత్ కరీంనగర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా విభాగాలకు అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో మై భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో గ్రామీణ యువత చురుగ్గా పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ అక్కేం నాగరాజు,అనంతారం గ్రామ సర్పంచ్ ఒల్లల రజిత వెంకటేష్ ఉపసర్పంచ్ కదం జయంత్ వార్డ్ సభ్యులు అక్కేం ఉపేందర్ మల్యాల రాజశేఖర్ బట్టి క్రాంతి, శిలాపురం రమేష్,యువజన సంఘం సభ్యులు, బొల్లం శ్రీకాంత్, బండారి వెంకటేష్, గోనెపెల్లి వెంకటేష్, ఒల్లల కృష్ణకుమార్, కదం రాజు,ధరవేణి నాగరాజు ఒల్లల మధు, చల్ల అంజి, అక్కేం హరికృష్ణ,చొప్పరి అభిరామ్,ఒల్లల శ్రీనివాస్,మల్యాల పర్శరాములు,అరవింద్, వినయ్, స్వామి కిరణ్, అభిషేక్, సురేష్, రాజు, సమీర్, రమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రుణాల పంపిణీ వేగవంతం చేయాలి..

- బ్యాంకులు లక్ష్యాలు తప్పనిసరిగా చేరుకోవాలి..
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని బ్యాంకులు ప్రభుత్వ లక్ష్యాల మేరకు రుణాల పంపిణీని వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ చైర్‌పర్సన్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన డీఎల్‌బీసీ సమావేశంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ, గృహ, విద్య రుణాలు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాల అమలు, మహిళా సంఘాలకు రుణాల పంపిణీ, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్వానిధి అమలు, పురోగతి పై బ్యాంకుల వారీగా సమీక్ష చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాంకులు తమకు కేటాయించిన రుణాల లక్ష్యాలను 100 శాతం చేరుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ, విద్య, గృహ నిర్మాణ రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన రుణాలను సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల్లో వినియోగంలో లేని ప్రభుత్వ ఖాతాల వివరాలను సమర్పించాలని, కేవైసీ అప్డేట్ ప్రక్రియను



వేగవంతం చేయాలని అన్నారు . అలాగే ఆర్‌సేథీ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలు, వివిధ రంగాలకు ఉపయోగపడే విధంగా శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలపై సమీక్షించి, మహిళలు వాటిని స్వయం ఉపాధికి వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా బ్యాంక్ సేవలపై వినియోగదారులకు అవగాహన పెంచాలని, ఆర్థిక అక్షరాస్యతతో పాటు ఆర్థిక మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం మల్లికార్జున రావు, ఆర్బీఐ ఏజీఎం రాములు సబావత్, నాబార్డ్ డీడీఎం దిలీప్, యూబీఐ ఏజీఎం సురేష్ కుమార్, టీజీబీ ఆర్ఎం రాజ నరేంద్ర, డీఆర్డీఓ గీత, డీవీహెచ్‌వో రవీందర్ రెడ్డి, డీఏఓ అఫ్జల్ బేగం, వివిధ బ్యాంకుల ప్రతినిధులు మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో కరీంనగర్ అర్బన్ ఇన్‌స్పెక్టర్

- గతంలో వేములవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ  గా పనిచేసి బెల్లం వ్యాపారుల నుండి వసూళ్లు
- సోదాల్లో రూ. 20 లక్షల నగదు సీజ్..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గతంలో వేములవాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ  గా పనిచేసిన ప్రస్తుత కరీంనగర్ అర్బన్ ఇన్‌స్పెక్టర్ గుండెటి రాము ఏవో  అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో రాముతో పాటు అతనికి సహకరించిన జగిత్యాల జిల్లా మల్యాల మండలం ఓబులాపూర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు జక్కని వేణు ఏవో 2 ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వేములవాడలో పనిచేసిన సమయంలో ఒక బెల్లం వ్యాపారి నుండి జక్కని వేణు ద్వారా రాము క్రమం తప్పకుండా లంచాలు వసూలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఈ అక్రమ లావాదేవీల కోసం 2022 నుండి 2024 వరకు డిజిటల్ యూపీఐ మార్గాలను ఎంచుకోవడం గమనార్హం. ఉపాధ్యాయుడు వేణు తన వ్యక్తిగత ఎస్‌బీఐ యూబీఐ ఖాతాలను బినామీగా వాడుతూ, ఆ నగదును రాము మరియు అతని తండ్రి ఖాతాలకు మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ రాము నివాసంలో జరిపిన సోదాల్లో లెక్కచూపని 20 లక్షల రూపాయల నగదును ఏసీబీ సీజ్ చేసింది. ప్రస్తుతం నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

## ఫీజు కట్టలేదని విద్యార్థిని బస్సు నుంచి దింపివేసిన వైనం

- జిల్లా విద్యాశాఖ అధికారికి విద్యార్థి తండ్రి ఫిర్యాదు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఫీజు చెల్లింపుల వివాదం నేపథ్యంలో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థిని పాఠశాల బస్సు నుంచి దింపివేసిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం రేపింది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన చింతమడక అనిల్ కుమార్ కుమారుడు  గాంధీనగర్‌లోని రైన్‌బో స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల వివరాల ప్రకారం, పాఠశాల ఫీజులను ఎప్పటికప్పుడు చెల్లిస్తూ వచ్చామని, ఇటీవల పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫీజు వెంటనే చెల్లించాలని పాఠశాల యాజమాన్యం ఫోన్ ద్వారా ఒత్తిడి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పాఠశాల బస్సులో వెళ్తున్న అయాంష్‌ను మధ్యలోనే దింపివేసినట్లు ఆరోపించారు. ఈ ఘటన చిన్నారి విద్యా హక్కులను ఉల్లంఘించడమే కాకుండా అతని మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే చర్యగా భావిస్తున్నామని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసి విచారణ జరిపించి, సంబంధిత పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కూడా కోరుతున్నారు.



## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కాంగ్రెస్ నుంచి బర్తరఫ్ చేయాలి

- బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

బలగం టీవి, హైదరాబాద్

బీసీ నాయకుడైన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను తొలగించి కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే 100 సీట్లు వస్తాయన్నా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలను బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించి, ఆయనను కాంగ్రెస్ నుంచి బర్తరఫ్ చేయాలని, అప్పుడే తెలంగాణలో కాంగ్రెస్ బతికి బట్టకడుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో పలు బీసీ కుల సంఘాలు, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కాదని, ఆయన ఒక పిచ్చి రెడ్డి అని రాష్ట్ర ప్రజలు మాట్లాడుకుంటున్నారని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్ష పదవిని రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే ఇక 100 ఏండ్లు అయినా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. బీసీల శాశ్వత శత్రువుగా మంత్రి వెంకటరెడ్డి నిలిచిపోతారని, ఇక మీదట ఆయన ఏ పార్టీలో ఉన్నా బీసీలు చిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు. అగ్రకుల అహంకారంతో బీసీలను అణగదొక్కడానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తూ బీసీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో వెంకటరెడ్డి నోరు తిరగకుండా తాగి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు చెప్పినట్టు అసెంబ్లీలో కొంతమంది ఊగుతూ..తూలుతూ వస్తున్నారని అందరికీ బ్రీత్ అనాలసిస్ చేయాలని చెప్పారన్నారు. బీసీ నాయకుల పట్ల అవమానకరంగా మాట్లాడిన మంత్రి వెంటనే బీసీ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.లేకపోతే భువనగిరి నియోజకవర్గంలో 2 లక్షల మంది బీసీలతో భారీ బహిరంగ సభ నిర్వహించి, ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మెన్ గుజ్జ కష్ణ, బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కుందారం గణేష్ చారి, పలు బీసీ కుల సంఘాల నేతలు, మేధావులు పాల్గొన్నారు.

## ఆదాయపు పన్ను వసూళ్లలో కీలక మార్పులు

బలగం టీవి, హైదరాబాద్

దేశంలో ఆదాయ పన్ను వ్యవస్థలో గత కొన్ని సంవత్సరాలుగా కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పన్ను విధానం  వల్ల మధ్యతరగతి ఉద్యోగులకు కొంత ఊరట లభిస్తోంది. 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2026--27 ఆర్థిక సంవత్సరంలో కూడా ఇదే పన్ను నిర్మాణం కొనసాగనుంది. ఈ నేపథ్యంలో ఎంత వరకు ఆదాయం ఉంటే పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదన్న అంశంపై స్పష్టత అవసరమైంది.

**కొత్త పన్ను విధానం అంటే...**

పన్ను వ్యవస్థను సరళీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పన్ను విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో మినహాయింపులు తక్కువగా ఉన్నప్పటికీ పన్ను స్లాబ్‌లు తగ్గించడంతో సాధారణ వేతనజీవులకు లెక్కలు సులభంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం సంవత్సరానికి రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి సెక్షన్ 87A రిబేట్ కారణంగా వాస్తవానికి ఆదాయ పన్ను ఉండదు.

**కొత్త పన్ను స్లాబ్‌లు**

రూ.3 లక్షల వరకు -- పన్ను లేదు
రూ.3 నుంచి రూ.6 లక్షలు -- 5%
రూ.6 నుంచి రూ.9 లక్షలు -- 10%
రూ.9 నుంచి రూ.12 లక్షలు -- 15%
రూ.12 నుంచి రూ.15 లక్షలు -- 20%
రూ.15 లక్షల పైగా -- 30%

ఈ లెక్కల ప్రకారం రూ.12 లక్షల ఆదాయానికి పన్ను రావాల్సి ఉన్నప్పటికీ సెక్షన్ 87A రిబేట్ వల్ల చివరికి పన్ను సున్నా అవుతుంది.

వేతనజీవులకు ప్రభుత్వం అందించే రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్ వల్ల పన్ను వర్తించే ఆదాయం తగ్గుతుంది. ఉదాహరణకు వార్షిక జీతం రూ.12.75 లక్షలు ఉన్నా డిడక్షన్ తర్వాత టాక్సబుల్ ఇన్‌కమ్ రూ.12 లక్షలకు చేరితే పన్ను పూర్తిగా రద్దవుతుంది.

రూ.12 లక్షలు దాటిన వెంటనే సెక్షన్ 87A రాయితీ వర్తించదు. ఆదాయం రూ.12.01 లక్షలు అయినా మొత్తం స్లాబ్‌ల ప్రకారం పన్ను లెక్కించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిలో సుమారు రూ.60 వేలకుపైగా పన్ను రావచ్చు. అందుకే ఆదాయం ఈ పరిమితి దగ్గర ఉన్నవారు జాగ్రత్తగా పన్ను ప్రణాళిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## నేపాల్‌లో హెలికాప్టర్ క్రాష్ ల్యాండింగ్

### మృతదేహాన్ని తరలిస్తుండగా ప్రమాదం.. వీడియో వైరల్



బలగం టీవీ, ఖట్మాండు

మృతదేహాన్ని తరలించేందుకు బయలుదేరిన హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో నియంత్రణ కోల్పోయి కుప్పకూలిన ఘటన తూర్పు నేపాల్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఖట్మాండు నుంచి ఖోటాంగ్ జిల్లాలోని కెపిలాస్‌గఢి ప్రాంతానికి మృతదేహాన్ని తీసుకెళుతుండగా హెలికాప్టర్ బేలాబీసీ గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ల్యాండింగ్ ప్రయత్నంలో ప్రమాదానికి గురైంది. తొలుత హెలికాప్టర్ సురక్షితంగా దిగినట్టే కనిపించినప్పటికీ, ఒక్కసారిగా దుమ్ము మేఘాలు ఎగసిపడటంతో నియంత్రణ తప్పి క్రాష్ ల్యాండింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో పైలట్‌తో పాటు నలుగురు ప్రయాణికులు ఉన్నారు. ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలు కాగా, ప్రాణ నష్టం జరగలేదని జిల్లా మేజిస్ట్రేట్ రేఖా కండెల్ తెలిపారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం మరో హెలికాప్టర్ ద్వారా ఖట్మాండుకు తరలించారు.

ల్యాండింగ్ సమయంలో వీచిన బలమైన గాలులు, దుమ్ము పేరుకుపోవడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. రోడ్డు, విమానాశ్రయ సౌకర్యాలు పరిమితంగా ఉండే నేపాల్ పర్వత ప్రాంతాల్లో హెలికాప్టర్ ప్రయాణాలు సాధారణమని పేర్కొన్నారు. ఇరుకైన లోయలు, ఆకస్మిక వాతావరణ మార్పులు, తాత్కాలిక ల్యాండింగ్ ప్రదేశాలు పైలట్లకు సవాళ్లుగా మారుతున్నాయని తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. సాంకేతిక లోపమా, పైలట్ తప్పిదమా లేదా వాతావరణ పరిస్థితుల ప్రభావమా అన్న కోణాల్లో అధికారులు విచారణ చేస్తున్నారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ 'ఎయిర్ డైనస్టీ' సంస్థకు చెందినదిగా గుర్తించారు.

# నగరంలో కల్తీ పన్నీర్ విక్రయం..

- ఆరుగురు అరెస్టు

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో కల్తీ, అశుభ్ర పన్నీర్ విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఖైరతాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, జీహెచ్‌ఎంసీ ఆహార భద్రతాధికారులతో కలిసి గంజ్‌బజార్ సమీపంలోని మహంకాళి ఆలయం వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆరు చిల్లర, పొదుపు దుకాణాలపై దాడులు చేసి కల్తీ పనీర్ విక్రయిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు తెలియని వనరుల నుంచి అశుభ్ర పనీర్ సేకరించి, హోటళ్లు, క్యాటరింగ్ సంస్థలు, వినియోగదారులకు నాణ్యమైన పనీర్ పేరుతో కిలో రూ.280కు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

పన్నీర్‌ను బహిరంగ ప్లాస్టిక్ కవర్లలో నిల్వ చేయడం వల్ల దుమ్ము, ఈగలు చేరుతున్నాయని, ప్యాకెట్లపై తయారీ తేదీ, గడువు తేదీ, బ్రాండ్ వివరాలు కూడా లేకపోవడంతో ఇవి మానవ వినియోగానికి అనర్హమని అధికారులు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను, స్వాధీనం చేసుకున్న సరుకును మహంకాళి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**కల్తీ డైరీ ఉత్పత్తులు సీజ్**

తనిఖీల్లో మొత్తం 3,892 కిలోల కల్తీ డైరీ ఉత్పత్తులను



అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.11.11 లక్షలుగా అంచనా వేశారు. శంకర్లాల్ మిల్క్ అండ్ కర్డ్ ప్రొడక్ట్స్, విజయ మిల్క్ అండ్ కర్డ్ షాప్, వైభవ్ మిల్క్ డైరీ, శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్, జగదాంబ మిల్క్ అండ్ కర్డ్ మర్చంట్, తులసిగిరిరాజ్ డైరీ ప్రొడక్ట్స్ దుకాణాల నుంచి పనీర్, కోవా, వైట్ క్రీమ్, నెయ్యి తదితర ఉత్పత్తులు పట్టుబడ్డాయి.

# ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి



- పుకార్లను నమ్మొద్దు
- జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి
- పౌరసరఫరాల శాఖ, గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులతో సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయనీ, ప్రజలు ఎటువంటి అపోహలకు, పుకార్లకు లోను కావద్దని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి ఇంధన సరఫరా పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగదారుల పానిక్ బుకింగ్ (అవసరం లేకున్నా భయంతో బుక్ చేయడం) వల్ల డిమాండ్ ఆకస్మికంగా పెరిగిందని, దీనివల్ల సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడుతున్నట్టు గమనించామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులు, హాస్టళ్లు, గృహ వినియోగదారులకు ఎల్పీజీ నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హాజరైన వైద్యాధికారులు, సంక్షేమ అధికారులు, తమకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్‌కు వివరించారు. వినియోగదారులతో నిరంతరం అందుబాటులో ఉంటూ, సరఫరా పరిస్థితిపై స్పష్టమైన సమాచారం అందించి వారిలో విశ్వాసం కల్పించాలని ఆయిల్ కంపెనీలను, ఏజెన్సీలను ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు గ్యాస్ అందిన 25 రోజుల గ్యాప్ తర్వాతే బుకింగ్ చేసుకోవాలని, డెలివరీ సమయంలో తప్పనిసరిగా 'డెలివరీ ధృవీకరణ కోడ్'ను సమర్పించాలని సూచించారు.

జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేత మాట్లాడుతూ గ్యాస్ డెలివరీ వాహనాలకు, సిబ్బందికి పూర్తి భద్రత కల్పిస్తామని తెలిపారు. పోలీస్, పౌరసరఫరాల శాఖల సంయుక్త బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తాయని, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడినా లేదా గ్యాస్ సరఫరాకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్ డీలర్లు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

బలగం టీవి, హైదరాబాద్

ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) సవరణ బిల్లు 2026ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలనిట్రాన్స్‌జెండర్, ఇంటర్ సెక్స్, జెండర్ నాన్‌కన్‌ఫార్మింగ్, క్వీర్ వర్గాలకు చెందిన వ్యక్తులు డిమాండ్ చేశారు. కేంద్ర సాంఘిక న్యాయం  సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ మార్చి 13న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ట్రాన్స్ జెండర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ స్వేచ్ఛ మాట్లాడుతూ దశాబ్దానికి పైగా కషి చేసి సాధించుకున్న చట్టపరమైన రక్షణలను ఈ బిల్లు వెనక్కి తీసుకెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్న వ్యతిరేక స్వరాలకు హైదరాబాద్ సమాజం కూడా మద్దతు తెలుపుతోందన్నారు.ప్రస్తుతం అమల్లో ఉన్న స్వీయ గుర్తింపు హక్కును ఈ సవరణ బిల్లు తొలగించి, జిల్లా వైద్య అధికారుల ద్వారా తప్పనిసరి ధ్రువీకరణ విధానాన్ని ప్రతిపాదిస్తోందని తెలిపారు. ఈ ప్రక్రియలో పారదర్శకత, ప్రమాణాలు, జవాబుదారీతనం లేవని విమర్శించారు. ట్రాన్స్ జెండర్ కాళీ మాట్లాడుతూ లింగ నిర్ధారణకు శాస్త్రీయంగా స్పష్టమైన ప్రమాణాలు లేనప్పటికీ వ్యక్తులను వైద్య పరీక్షలకు గురిచేయడం మానసికంగా హానికరమన్నారు. చట్టపరమైన గుర్తింపునకు శస్త్రచికిత్సను ఆధారంగా చేసుకోవడం మానవ హక్కులకు విరుద్ధమని తెలిపారు. శస్త్రచికిత్స వివరాలను జిల్లా మేజిస్ట్రేట్‌కు తెలియజేయాలనే నిబంధన గోప్యత హక్కును ఉల్లంఘిస్తోందన్నారు. బిల్లులో ట్రాన్స్‌జెండర్ నిర్వచనాన్ని పరిమితం చేయడం వల్ల ట్రాన్స్ పురుషులు, నాన్–బైనరీ, జెండర్ క్వీర్ వ్యక్తులు గుర్తింపు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



ఇంటర్‌సెక్స్ వ్యక్తులను ట్రాన్స్‌జెండర్ వర్గంతో కలిపివేయడం వల్ల వారి ప్రత్యేక హక్కుల సమస్యలు పక్కనపడే అవకాశం ఉందని తెలిపారు. ఈ సవరణ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని, ట్రాన్స్‌జెండర్ సహా లింగ వైవిధ్య వర్గాల హక్కులను పరిరక్షించేలా చట్టాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ట్రాన్స్‌జెండర్లు లిల్లీ, నిత్య, నీతి, భారీ సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే మూసీ ప్రక్షాళన ప్రారంభం



- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

మూసీ నది ప్రక్షాళన కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలోనే ప్రారంభమైందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై మాట్లాడిన ఆయన, మూసీ పరివాహక ప్రాంత ప్రజలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, ప్రభుత్వం చేపట్టే చర్యలను స్వాగతిస్తామని తెలిపారు. అయితే ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లపై ఎర్ర గుర్తులు వేయడం సరైంది కాదని విమర్శించారు. ప్రక్షాళన కార్యక్రమం మూడు దశల్లో చేపట్టినట్లు ఆయన వివరించారు. మొదటి దశలో హైదరాబాద్‌లోని కాలుష్య నీటిని శుద్ధి చేయడానికి రూ.3,600 కోట్ల వ్యయంతో 31 ఎస్‌టీపీలు నిర్మాణం చేపట్టామని, అందులో దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. బఫర్ జోన్‌లో 11 వేల నిర్మాణాలు గుర్తించినప్పటికీ ఒక్క ఇల్లు కూడా కూల్చివేయలేదని తెలిపారు.

రెండో దశలో మూసీలో పేరుకుపోయిన పారిశ్రామిక కాలుష్యాన్ని తొలగించి, రెండు వైపులా రహదారి అభివృద్ధి చేసి నీరు నిరంతరం ప్రవహించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం రూ.6 కోట్ల వ్యయం చేసినట్లు తెలిపారు. మూడో దశలో కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం జలాలను హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లకు మళ్లిస్తూ 15 చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని చెప్పారు. దీంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టాలు పడిపోకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నాగోల్ నుంచి గండిపేట్ వరకు నార్త్, వెస్ట్ కారిడార్‌లతో రహదారి లింక్ ప్రాజెక్ట్‌ను రూపొందించామని, మధ్యలో 15 వంతెనలకు అనుమతులు ఇచ్చి రూ.500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తమ హయాంలో ప్రారంభించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా నత్తనడకన కొనసాగిస్తున్నదని ఆరోపించారు.

# రైతులకు లాభాల పంట ఆయిల్ పామ్ పంట

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

రైతులకు లాభాల పంట ఆయిల్ పామ్ పంట అని, దాని అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం గుత్ప గ్రామ శివారులో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధిక లాభాలను అందిస్తూ, అనేక ప్రయోజనాలు సమకూర్చే ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేలా జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో ప్రత్యేక చొరవ చూపుతున్నామని, ఫలితంగా జిల్లాలో సుమారు 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. స్థల నిర్ధారణ జరిగిన వెంటనే ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. దేశ వ్యాప్తంగా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణంలోపే ఈ పంట సాగు చేస్తున్నారని తెలిపారు. స్థానికంగానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించడంతో పాటు ప్రజలకు కూడా మేలు చేసిన వారవుతారని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని, ఇన్ పుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలకు అయ్యే వ్యయంలో కూడా అధిక మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తూ సబ్సిడీ రూపంలో



కంపెనీలకు చెల్లిస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం ఉండదని భరోసా కల్పించారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను సైతం పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రూ. రెండు లక్షల పైగా ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. స్థల పరిశీలన జరిపిన వారిలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, రమణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌గా ఇషాన్ కిషన్



- వైస్ కెప్టెన్‌గా అభిషేక్ శర్మ
- కొన్ని మ్యాచ్‌లకు కమిన్స్ దూరం కావడంతో నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్**

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు షాకింగ్ వార్త. ఐపీఎల్--2026 సీజన్ ప్రారంభానికి ముందే జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. గత సీజన్‌లో జట్టును ఫైనల్‌కు చేర్చిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పి కారణంగా టోర్నీ తొలి కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో టీమిండియా వికెట్‌కీపర్--బ్యాటర్ ఇషాన్ కిషన్కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

**గాయం కారణంగా కమిన్స్ గైర్హాజరు**

ప్యాట్ కమిన్స్ గత కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ఈ గాయం కారణంగానే ఆయన ఇటీవల జరిగిన యాషెస్ సిరీస్‌లో కేవలం ఒక టెస్టు మాత్రమే ఆడినట్లు తెలుస్తోంది. అలాగే టీ20 ప్రపంచకప్--2026కు కూడా దూరం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం కోలుకుంటున్నప్పటికీ ఐపీఎల్ తొలి మ్యాచ్‌ల నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించడం కష్టమని భావిస్తున్నారు.

ఇషాన్ కిషన్‌కు ఐపీఎల్‌లో కెప్టెన్సీ అనుభవం లేకపోయినా దేశవాళీ క్రికెట్‌లో ఆయన చూపిన నాయకత్వానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన సారథ్యంలో జార్ఖండ్ జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలుచుకోవడం విశేషం. ఫైనల్లో హర్యానాపై సెంచరీతో చెలరేగి జట్టును విజేతగా నిలిపిన ప్రదర్శన గుర్తుండిపోయింది.ఇక యువ సంచలనం, లోకల్ ప్లేయర్ అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ ఇద్దరు యువ ఆటగాళ్ల నాయకత్వంలో జట్టు విజయవంతంగా ముందుకు సాగుతుందని యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది.మొత్తం మీద ఐపీఎల్--2026 ప్రారంభానికి ముందే ఎస్ఆర్‌హెచ్‌లో నాయకత్వ మార్పు చోటుచేసుకోవడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ‘సన్‌రైజర్స్’ వివాదం.. రంగంలోకి దిగిన లలిత్ మోదీ

- కావ్యా మారన్‌కు మద్దతుగా స్పందన

**బలగం టీవీ, హైదరాబాద్**

విదేశీ క్రికెట్ లీగ్ ది హండ్రెడ్ వేలంలో పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ నిర్ణయం తర్వాత సన్‌రైజర్స్ యాజమాన్యంపై, ముఖ్యంగా ఓనర్ కావ్యా మారన్పై అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లను బహిష్కరించాలని సోషల్ మీడియాలో పిలుపునిస్తున్నారు.

ఈ వివాదం మరింత చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో ఐపీఎల్ మాజీ ఛైర్మన్, వ్యాపారవేత్త లలిత్ మోదీ స్పందించారు. ఎక్స్‌లో పోస్టు చేసిన ఆయన.. క్రికెట్‌లో రాజకీయ జోక్యం ఉండకూడదని పేర్కొన్నారు. భారత్‌లో జరిగే ఐపీఎల్‌లో పాక్ ఆటగాళ్లు ఆడకపోయినా, విదేశీ లీగ్ అయిన ‘ది హండ్రెడ్’లో



పాక్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంలో తప్పేమీ లేదని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారాన్ని ఎలా నిర్వహించాలో తనకు తెలుసని, అవసరమైతే సంప్రదించాలని సూచించారు.

అబ్రార్ అహ్మద్‌ను సుమారు రూ.2.34 కోట్లకు కొనుగోలు చేయడం అభిమానుల్లో ఆగ్రహానికి దారి తీసింది. పలువురు మాజీ క్రికెటర్లు కూడా ఈ నిర్ణయంపై విమర్శలు చేశారు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు ఈ వివాదం జాతీయ స్థాయిలో చర్చకు కారణమైంది.ఇదిలా ఉండగా 2010లో ఐపీఎల్‌కు సంబంధించిన ఆర్థిక అక్రమాల ఆరోపణల నేపథ్యంలో లలిత్ మోదీ దేశం విడిచి వెళ్లిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్నారు. ప్రసార హక్కుల కేటాయింపులో అవకతవకలు, భారీ కిక్‌బ్యాక్ ఆరోపణలు ఆయనపై నమోదయ్యాయి. తాజా వ్యాఖ్యలతో సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ తీసుకున్న నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చ మరింత ముదిరే అవకాశముందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

# బీసీలకు ఏటా రూ.20 వేల కోట్ల బడ్జెట్ ఏమైంది..?:



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**బలగం టీవీ, హైదరాబాద్**

శాసనసభ జీరో అవర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను బీసీల కోసం కేటాయిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ఎంత నిధులు విడుదల చేశారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పిన హామీ పరిస్థితి ఏమైందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

బీసీ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజుల బకాయిలు సుమారు రూ.10 వేల కోట్లకు చేరుకున్నాయని తలసాని తెలిపారు. ఫీజులు ఎప్పుడు అందుతాయా అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో ప్రభుత్వం చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. బీసీల పట్ల చులకన భావన వద్దని సూచిస్తూ రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అధిక కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు.

సభలో ఈ అంశాలపై ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందిస్తూ సీనియర్ సభ్యుడు ప్రస్తావించిన విషయాలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. జీరో అవర్ ప్రాముఖ్యత తలసానికి తెలుసని పేర్కొంటూ, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశంపై త్వరలోనే స్పష్టత ఇస్తుందని సభలో పేర్కొన్నారు.

# పారిశుధ్య నిర్వహణపై మరింత ఫోకస్ పెట్టాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశుధ్య నిర్వహణపై మరింత ఫోకస్ పెట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన సానిటేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ‘ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక’ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల కల్లా ప్రధాన రహదారుల వెంట చెత్త పూర్తిగా తొలగించి క్లీన్ గా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 10 గంటల తర్వాత ప్రధాన రహదారులపై క్లీనింగ్ కార్యకలాపాలు కనిపించకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సానిటేషన్ బాధ్యత ప్రధానంగా డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈలదేనని పేర్కొన్నారు. గ్రీన్ వేస్ట్ తొలగింపు బాధ్యతను కూడా ఇకపై ఎస్‌డబ్ల్యూఎం విభాగమే నిర్వహించాలని తెలిపారు. అలాగే సీ అండ్ డీ వ్యర్థాలు, దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్త, గ్రీన్ వేస్ట్‌ను వేగంగా తొలగించేందుకు అదనపు వాహనాలు సమకూరుస్తామని వెల్లడించారు. పారిశుధ్యంపై మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై క్విక్ రెస్పాన్స్, యాక్షన్ ఉండాలన్నారు. ఉద్యోగులకు



వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో సానిటేషన్ అదనపు కమిషనర్ రవికిరణ్, జోనల్ కమిషనర్లు ప్రియాంక అలా, మందా మకరందు, ముకుందారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం డీఈఈలు, రాంకీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నంబర్ 7కు గుడ్‌బై చెబుతున్నాడా ధోనీ?




- ఫేస్‌బుక్ పోస్టుతో అభిమానుల్లో కలకలం

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మాజీ కెప్టెన్, కెప్టెన్ కూల్‌గా పేరుగాంచిన మహేంద్ర సింగ్ ధోనీ చేసిన తాజా ఫేస్‌బుక్ పోస్టు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. రెండు దశాబ్దాలుగా తనతో పాటు ప్రయాణిస్తున్న ఐకానిక్ నంబర్ 7 జెర్సీని వదిలి నంబర్ 8కు మారుతున్నట్లు పరోక్షంగా సూచించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. “కొన్ని నంబర్లు మనతోనే ఉండిపోతాయి. 7 ఎప్పుడూ నాకో ప్రత్యేక నంబర్. కానీ ఈరోజు నేను 8కి మారుతున్నాను. ఎందుకో త్వరలో తెలుస్తుంది” అంటూ ధోనీ చేసిన వ్యాఖ్యలతో ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇది వాణిజ్య ప్రకటనలో భాగమై ఉండవచ్చని కొందరు భావిస్తుండగా, మరికొందరు ధోనీ నంబర్ 7తోనే కొనసాగాలని కోరుతున్నారు.

2004లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచి రిటైర్మెంట్ వరకు, అనంతరం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా కూడా ధోనీ నంబర్ 7 జెర్సీతోనే బరిలోకి దిగుతున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఐపీఎల్ 2026లో ధోనీ పాత్రపై దక్షిణాఫ్రికా దిగ్గజ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గత కొన్నేళ్లుగా సీఎస్‌కే బ్రాండ్‌ను బలంగా నిలబెట్టడమే ధోనీ ప్రధాన పాత్రగా మారిందని అభిప్రాయపడ్డాడు. గత సీజన్‌లో మాదిరిగా 8వ లేదా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు రావడం సరైనది కాదని, జట్టుకు మరింత ఉపయోగపడాలంటే కనీసం 6వ స్థానంలో లేదా వీలైతే 4--5 స్థానాల్లో బ్యాటింగ్‌కు రావాలని సూచించాడు. 44 ఏళ్ల వయసులోనూ ధోనీలో ఇంకా పరుగులు చేసే సామర్థ్యం ఉందని పేర్కొన్నాడు. ఒకవైపు జెర్సీ నంబర్ మార్పుపై ఊహాగానాలు, మరోవైపు వచ్చే ఐపీఎల్ సీజన్‌లో అతని పాత్రపై విశ్లేషణలతో ధోనీ మరోసారి క్రికెట్ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాడు.

## ఆర్సీబీకి గుండెకాయ కోహ్లీనే: ఏబీ డివిలియర్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీకి భారత బ్యాటింగ్ దిగ్గజం విరాట్ కోహ్లీనే మూలస్తంభమని ఆ జట్టు మాజీ సూపర్‌స్టార్ ఏబీ డివిలియర్స్ ప్రశంసించాడు. కేవలం బ్యాటింగ్‌తోనే కాకుండా మైదానంలో అతను చూపించే ఉత్సాహం, నాయకత్వ లక్షణాలు జట్టుకు ఎంతో కీలకమని అభిప్రాయపడ్డాడు. జియోహాట్‌స్టార్‌తో మాట్లాడిన డివిలియర్స్.. సంవత్సరాలుగా కోహ్లీ బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన ఇస్తూనే తన ఎనర్జీతో జట్టుకు ప్రాణం పోస్తున్నాడని పేర్కొన్నాడు. అతని పోరాటస్ఫూర్తి యువ ఆటగాళ్లలో నమ్మకం పెంచుతుందని, జట్టు విజయంలో అది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పాడు.



గత సీజన్‌లో ఆర్సీబీ తొలిసారి ట్రోఫీ గెలవడంలో జట్టు సమష్టి ప్రదర్శన ప్రధాన కారణమని డివిలియర్స్ విశ్లేషించాడు. గతంలో ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్లపై ఎక్కువగా ఆధారపడిన జట్టు.. ఇప్పుడు మొత్తం టీమ్‌గా రాణించిందని పేర్కొన్నాడు. ఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీ 35 బంతుల్లో 43 పరుగులు చేసినప్పటికీ, రజత్ పాటిదార్, లియామ్ లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, రొమారియో షెపర్డ్ వేగంగా ఆడి జట్టు స్కోరును 190 దాటించారని గుర్తుచేశాడు. అలాగే కృనాల్ పాండ్యా బంతితో మెరుగైన ప్రదర్శన కనబరిచాడని తెలిపాడు. ఈ సమష్టి ప్రదర్శనతో కోహ్లీపై ఉన్న ఒత్తిడి తగ్గిందని, జట్టు భారాన్ని తానొక్కడే మోయాల్సిన అవసరం లేదనే నమ్మకం కలిగిందని డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు. పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్న ఆర్సీబీ ఈ సీజన్‌లోనూ టైటిల్ నిలబెట్టుకునే సత్తా ఉందని ధీమా



# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపిన టీమిండియా

- బ్యాటింగ్ టాప్-5లో ముగ్గురు భారత ఆటగాళ్లు
- బౌలింగ్, ఆల్‌రౌండర్లలో ఆఫ్ఘన్ హవా

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ఆటగాళ్లు టాప్-5లో ఏకంగా మూడు స్థానాలను దక్కించుకోవడం విశేషం. తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానంలో నిలిచాడు. భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచి తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా, భారత కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచాడు. ప్రపంచ టాప్-5 బ్యాటర్లలో ముగ్గురు భారతీయులే ఉండటం టీమిండియా బ్యాటింగ్ బలాన్ని ప్రతిబింబిస్తోంది.

**బౌలింగ్, ఆల్‌రౌండర్లలో ఆఫ్ఘన్ ఆధిపత్యం**

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. నమీబియాకు చెందిన బెర్నార్డ్ స్కోల్జ్ నాలుగో స్థానంలో నిలవడం విశేషంగా మారింది.

ఆల్‌రౌండర్ల జాబితాలో ఆఫ్ఘనిస్తాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ అగ్రస్థానంలో నిలిచాడు. జింబాబ్వేకు చెందిన సికందర్ రజా, ఆఫ్ఘనిస్తాన్ సీనియర్ మహ్మద్ నబీ టాప్-3లో చోటు సంపాదించారు.

**మహిళల వన్డేల్లోనూ భారత్ జెండా**

మహిళల బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ నాట్ స్కివర్-బ్రంట్ రెండో స్థానంలో ఉండగా, భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా బ్యాటర్ బెత్ మూనీ, దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ కూడా మెరుగైన ర్యాంకులు సాధించారు.

**టీ20ల్లోనూ భారత యువత జోరు**

టీ20 ఫార్మాట్‌లోనూ భారత ఆటగాళ్లు ప్రభావం చూపుతున్నారు. తాజా ర్యాంకింగ్స్‌లో యువ సంచలనం అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ రెండో స్థానంలో నిలిచాడు. తిలక్ వర్మ ఒక స్థానం ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ టాప్-10లో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. సంజూ శాంసన్ 21వ స్థానానికి చేరుకుని మెరుగుపడ్డాడు. బౌలింగ్ విభాగంలో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో ర్యాంకుకు చేరుకున్నాడు.



# ఒర్లీన్స్ మాస్టర్స్‌లో భారత క్రీడాకారుల రాణింపు

- ప్రిక్వార్టర్స్‌కు ఆయూష్ శెట్టి, తన్వి శర్మ -- శ్రీకాంత్‌కు నిరాశ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

బీడబ్ల్యూఎఫ్ ఒర్లీన్స్ మాస్టర్స్ సూపర్--300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. పురుషుల సింగిల్స్‌లో యువ ఆటగాడు ఆయూష్ శెట్టి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. తొలి గేమ్‌లో వెనుకబడ్డప్పటికీ, పోరాటపటిమతో తిరిగి పుంజుకుని సహచర భారత ఆటగాడు కిరణ్ జార్జ్పై 17-21, 21-10, 21-17తో విజయం సాధించాడు. ఇదే విభాగంలో సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్కు నిరాశ ఎదురైంది. డెన్మార్క్‌కు చెందిన మాగ్నస్ జొనాసెన్ చేతిలో 12-21, 10-21తో ఓటమి పాలయ్యాడు.

**మహిళల సింగిల్స్‌లోనూ విజయాలు**

మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి తన్వి శర్మ 21-18తో థాయ్‌లాండ్‌కు చెందిన సుపనిదపై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. మరో భారత క్రీడాకారిణి మాళవిక బన్సోడ్ 21-18, 21-14తో తైవాన్‌కు చెందిన సుంగ్ షువొ--యున్‌పై విజయం సాధించింది. అదే విధంగా అన్మోల్ ఖర్బ్ కూడా టర్కీకి చెందిన అరిన్‌పై 21-12, 21-16తో గెలిచి ప్రిక్వార్టర్స్‌లో స్థానం సంపాదించింది. మొత్తంగా ఒర్లీన్స్ మాస్టర్స్ టోర్నీలో భారత క్రీడాకారులు వరుస విజయాలతో మంచి ఊపు మీద కొనసాగుతున్నారు.



# ఆగి ఉన్న స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

- 9మంది విద్యార్థులకు గాయాలు
- సిద్దిపేట జిల్లా ఇబ్రహీంనగర్‌లో ఘటన

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆగి ఉన్న స్కూలు బస్సును వెనుక నుంచి వచ్చిన సిమెంటు లోడ్ లారీ అతివేగంగా ఢీకొట్టింది. దాంతో తొమ్మిది మంది విద్యార్థులకు గాయలయ్యాయి. ఈ ఘటన సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేటలోని రావూస్ పాఠశాలకు చెందిన బస్సు మండలంలోని ఆయా గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చే క్రమంలో ఇబ్రహీంనగర్ గ్రామంలో స్కూల్ పిల్లలు ఎక్కడానికి ఆగింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన సిమెంట్ లోడ్ లారీ బలంగా బస్సును ఢీకొన్నది. దాంతో బస్సులో ఉన్న తొమ్మిది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా సిద్ధిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. కాగా విద్యార్థులకు తీవ్ర గాయాలు కాకపోవడంతో.. పిల్లల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## బెంగాల్‌లో 13మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

**బలగం టీవీ, హైదరాబాద్**

పశ్చిమ బెంగాల్‌కు చెందిన 13మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ బుధవారం ఆదేశించింది. పలువురు జిల్లా మేజిస్ట్రేట్‌లను నియమించడంతో పాటూ వారికి జిల్లా ఎన్నికల అధికారులు (డిఇఓ) గా, ఎన్నికల పరిశీలకులుగా కీలకమైన బాధ్యతలు అప్పగించింది. కోల్‌కతా మున్సిపల్ కమిషనర్‌గా, కోల్‌కతా ఉత్తర డిఇఓగా స్మితా పాండేను, రణధీర్ కుమార్‌ను కోల్‌కతా దక్షిణ డిఇఓగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇంకా పలువురు నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరిగేలా చూడడంలో వీరు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొంది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది.

రూ.42.65కోట్ల విలువ చేసే నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఇసి బుధవారం ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణా కార్యకలాపాల్లో భాగంగా వీటిని స్వాధీనపరుచుకున్నట్లు తెలిపింది. వీటిలో రూ.2.37కోట్లు నగదు కాగా, రూ.2.88కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ.16.42కోట్ల విలువైన ఆభరణాలు, ఉచితాలుగా పంచిపెట్టే వస్తువులు, లిక్కర్ వంటివి వున్నాయని తెలిపారు.

balagamtv100@gmail.com

# త్రిష పైనే పొత్తు భారం కీలక మంత్రాంగం,





బిగ్ ఆఫర్: 'జననాయగన్' కు ఇక..!? తమిళనాడు ఎన్నికల వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీవీకే విజయ్ ను తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ నేతలు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ కేంద్రంగా కీలక మంత్రాంగం కొనసాగుతోంది. ఈ సారి త్రిష కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. అందులో భాగంగా పొత్తు డీల్ పైన కొత్త ఆఫర్లు తెర మీదకు వచ్చినట్లు తెలుస్తోంది. 'జననాయగన్' సినిమా పైనా కొత్త సమాచారం బయటకు వస్తోంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు హోరా హోరీగా మారుతున్నాయి. డీఎంకే- ఎన్డీఏ తో పాటుగా టీవీకే ఈ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు సిద్ధం అవుతున్నాయి. టీవీకే ఎన్డీఏలో చేరుతుందని.. ఈ మేరకు బిగ్ ఆఫర్లు వచ్చినట్లు ప్రచారం సాగింది. అయితే, తాజాగా టీవీకే నేతలు తాము సొంతంగానే పోటీ చేస్తామని తేల్చి చెబుతున్నారు. ఇదే సమయంలో టీవీకే వరుస వివాదాలను కొని తెచ్చుకుంటోంది. ఈ సమయంలో త్రిష కేంద్రంగా టీవీకే పొత్తు వ్యవహారం పైన కొత్త చర్చలు తెర మీదకు వస్తున్నాయి. ఎన్డీఏలోకి టీవీకే చేరిక పైన త్రిష తో సంప్రదింపులు మొదలైనట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ-టీవీకే పొత్తు సినీనటి త్రిష చేతుల్లో ఉందనే వాదన ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్ పెద్ద ఎత్తున వినిపిస్తోంది. ఈ ఎన్నికల్లో పాలక డీఎంకేదే పైచేయి అని, విపక్ష ఎన్డీఏపై 5 శాతం ఓట్ల ఆధిక్యంతో ఉందని తాజాగా సర్వే చేసిన ప్రముఖ సంస్థలు ప్రధాన పార్టీలకు నివేదికలు సమర్పించాయి. తేలని పొత్తుల లెక్కలు... ఉత్కంఠ పెంచుతున్న సర్వేలు అదే సమయంలో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీకి 12 శాతం ఓట్లు రావచ్చని పలు సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. ఎన్డీఏ నేతలు అప్రమత్తమయ్యారు. ఎలాగైనా విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కరూర్ తొక్కిసలాట ఘటన వ్యవహారం విజయ్‌ను ఇప్పటికీ వెంటాడుతోంది. సీబీఐ విచారణతో ఆయన ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆయన 'జననాయగన్' సినిమాకు కేంద్ర సెన్సార్ బోర్డు నుంచి క్లియరెన్సు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఆయనకు సన్నిహితురాలిగా భావిస్తున్న త్రిష తో ఎన్డీఏ ముఖ్య నేతలు భేటీ అయినట్లు పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం సాగుతోంది. ఈ చర్చల్లో పొత్తు ఖాయమైతే టీవీకే కు దక్కే ప్రయోజనాల పైన సీట్లు.. భవిష్యత్ ఆఫర్లు ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సెన్సార్ బోర్డు సైతం విజయ్ సినిమాను పునఃపరిశీలిం చేందుకు తాజాగా అంగీకరించినట్లు తెలుస్తోంది. మరో వైపు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి కుమారుడు మిధున్ కూడా పలు మార్లు త్రిషతో సమావేశమైనట్లు తెలుస్తోంది. అటు టీవీకే నేతలు తమకు ఎవరితో పొత్తు ఉండదని చెబుతున్న వేళ.. త్రిష కేంద్రంగా సాగుతున్న ఈ ప్రచారం ఎన్నికల వేళ ఆసక్తి కరంగా మారుతోంది.

# విడుదల వేళ..ఉస్తాద్ షాకింగ్ డెసిషన్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. దీనిపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందీ మూవీ. ఉగాది పండుగ సీజన్‌లో థియేటర్లలోకి రాబోతోంది. శ్రీలీల, రాశీఖన్నా హీరోయిన్లు. మైత్రీ మూవీస్ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ సినిమాను నిర్మించారు. అశుతోష్ రాణా, నవాబ్ షా, అవినాష్, గౌతమి కీలక పాత్రల్లో నటించారు.సినిమా టిక్కెట్ ధరల పెంపుపై కొద్ది రోజులుగా విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో అభిమానులకు శుభవార్త అందింది. నైజాం ప్రాంతంలో టికెట్ రేట్లు పెంచకూడదని మైత్రీ మూవీస్ మేకర్స్ నిర్ణయించింది. ఎప్పట్లాగే సాధారణ టిక్కెట్ ధరలకే ప్రేక్షకుల ముందుకు తీసుకుని రాబోతోంది. మామూలు టికెట్ రేట్లకే ఉస్తాద్ భగత్ సింగ్ విడుదల కానుంది. ఈ నిర్ణయం తెలంగాణలో పవన్ కళ్యాణ్ అభిమానులను ఆనందంలో నింపింది.స్టార్ హీరోల భారీ చిత్రాలు విడుదలైనప్పుడు మొదటి వారం లేదా 10 రోజుల పాటు టిక్కెట్ ధరలను పెంచడం తెలుగు చిత్ర పరిశ్రమలో ఆనవాయితీగా వస్తోన్న విషయం తెలిసిదే. హైబడ్జెట్ సినిమాల ద్వారా ప్రారంభ రోజుల్లో ఎక్కువ ఆదాయం పొందాలనే ఉద్దేశంతో అదనపు ఛార్జీలు, ప్రత్యేక ప్రదర్శనలను నిర్వహించడం మనం చూస్తుంటాం. దీనికి భిన్నంగా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తాజా నిర్ణయం తీసుకుంది.నైజాం ప్రాంతంలో ఈ సినిమా పంపిణీ బాధ్యతలను కూడా మైత్రీ మూవీ మేకర్సే చూసుకుంటోంది. ఈ ఏరియాలో టిక్కెట్ ధరలను ఏమాత్రం పెంచకుండా ప్రభుత్వం ఆమోదించిన సాధారణ రేట్లకే సినిమాను ప్రదర్శించాలని చిత్ర నిర్మాణ సంస్థ నిర్ణయించింది. దీనివల్ల నైజా ఏరియా ప్రేక్షకులు ఎటువంటి అదనపు ధరను చెల్లించకుండానే ఈ చిత్రాన్ని వీక్షించగలరు. తెలంగాణలో ఈ సినిమా మొదటి షో గురువారం ఉదయం 7:30 గంటలకు ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.ఈ నిర్ణయం వెనుక రెండు ప్రధాన కారణాలు ఉన్నాయనేది ఫిల్మ్ నగర్ టాక్. మొదటిది- తెలంగాణ హైకోర్టు గతంలో స్పష్టంగా జారీ చేసిన మార్గదర్శకాలను పాటిస్తూ చట్టపరమైన చిక్కులను నివారించడం. ఈ విషయంలో మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టుకు వెళ్లి హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే తెచ్చుకుంది. రెండవది- సినిమాను సామాన్య ప్రేక్షకులకు మరింత అందుబాటులోకి తీసుకురావడం. సాధారణ టిక్కెట్ ధరలు ఉంటే ఉగాది పండగ సీజన్ లో ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి చిత్రాన్ని చూస్తారని భావిస్తోంది.

# రాజకీయాల్లో నటీమణులను లాగొద్దు..

## మంచు విష్ణు ఘాటు స్పందన



తమిళనాడు రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ హీరో విజయ్ సొంత రాజకీయ పార్టీ ప్రారంభించిన తర్వాత ఆయన వ్యక్తిగత జీవితంపై వస్తున్న విమర్శలు కలకలం రేపుతున్నాయి. విజయ్ భార్యతో విడాకుల వ్యవహారం, అలాగే ప్రముఖ నటి త్రిషతో ఆయనకు సంబంధం ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రచారాలపై ఇప్పటికే సీనియర్ నటి ఖుష్బూ సుందర్ స్పందించారు. త్రిష ఎంతో గౌరవనీయమైన నటి అని, ఆమెపై ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం సరికాదని పేర్కొంటూ ఆమెకు మద్దతుగా నిలిచారు.ఈ వివాదాల నేపథ్యంలో నటుడు మంచు విష్ణు కూడా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. రాజకీయ కథనాల్లోకి నటీమణులను లాగడం అత్యంత అసభ్యకరమైన చర్య అని ఆయన తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం తమిళనాడులోనే కాకుండా ఎక్కడైనా రాజకీయ లబ్ధి కోసం సినీ తారల వ్యక్తిగత జీవితాలను ఉపయోగించడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. నటీనటులు కేవలం తెరపై కనిపించే పాత్రలే కాకుండా వారికి కూడా భావోద్వేగాలు, గౌరవం ఉంటాయని మంచు విష్ణు పేర్కొన్నారు. వారి జీవితాల్లో కూడా ఒక ప్రైవేట్ స్పేస్ ఉంటుందని, దానిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని చెప్పారు. అలాగే నటీనటులకు కుటుంబాలు ఉంటాయని, సమాజంలో వారికి ఒక హోదా ఉంటుందని ఆయన గుర్తు చేశారు.రాజకీయ ప్రయోజనాల కోసం వారి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడం నాగరిక సమాజానికి తగినది కాదని వ్యాఖ్యానించారు. ప్రజా చర్చలు లేదా రాజకీయ విమర్శలు అనేవి ప్రాథమిక గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదని విష్ణు సూచించారు. ముఖ్యంగా మహిళల విషయంలో మరింత సంయమనం పాటించాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినా అవి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఉండకూడదని, వార్తల కోసం వారిని బలిపశువులుగా మార్చడం తగదని హితవు పలికారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎప్పుడూ గౌరవప్రదమైన స్థానం ఉంటుందని గుర్తు చేసిన మంచు విష్ణు, అలాంటి దేశంలో రాజకీయాల కోసం మహిళలను అవమానాలకు గురిచేయడం దురదృష్టకరమని అన్నారు. "మనం మరింత మెరుగ్గా ప్రవర్తిద్దాం" అంటూ సమాజానికి, రాజకీయ వర్గాలకు ఆయన పిలుపునిచ్చారు.

2001 సంక్రాంతికి చిరు - బాలయ్య

## అభిమానుల మధ్య హోరాహోరీ యుద్ధం!



తెలుగు సినిమా చరిత్రలో 2001 జనవరి 11వ తేదీ ఒక ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ఆ రోజు మెగాస్టార్ చిరంజీవి 'మృగరాజు', నందమూరి బాలకృష్ణ 'నరసింహ నాయుడు' థియేటర్లలోకి వచ్చాయి. అయితే ఆ సమయంలో చిరు, బాలయ్య అభిమానులు వీటిని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. తమ సినిమా ఆడుతుందంటే, తమ సినిమా ఆడుతుందంటూ విడుదలకు నెలరోజుల ముందు నుంచే గొడవలు పడటం ప్రారంభించారు. ఒకరి ఫ్లెక్సీలను మరొకరు చించేసుకున్నారు హాలీవుడ్ చిత్రం 'ది ఘోస్ట్ అండ్ ది డార్క్‌నెస్' ఆధారంగా గుణశేఖర్ దర్శకత్వంలో మృగరాజు రాగా, 'సమరసింహా రెడ్డి' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత బి. గోపాల్ దర్శకత్వంలో బాలయ్య చేసిన ఫ్యాక్షన్ డ్రామా నరసింహనాయుడు. పరుచూరి బ్రదర్స్ పవర్‌ఫుల్ డైలాగులు, మణిశర్మ సంగీతం ఈ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సినిమా విడుదలకు వారం రోజుల ముందే రాష్ట్రవ్యాప్తంగా థియేటర్ల వద్ద ఉద్రిక్తత మొదలైంది. ఇద్దరు హీరోల అభిమానుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. తమ హీరో కటౌట్ పెద్దదిగా ఉండాలంటే, తమ హీరో కటౌట్ పెద్దదిగా ఉండాలని ఇద్దరు హీరోల అభిమానులు పోటీపడ్డారు. కొన్ని చోట్ల ఒకరి ఫ్లెక్సీలను మరొకరు చించేసుకున్నారు. వివాదాలన్నీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాయి. కొన్ని సెంటర్లలో ప్రత్యర్థి హీరోల పోస్టర్లపై నల్ల రంగు పోయడం, కటౌట్లకు చెప్పుల దండలు వేయడంతో థియేటర్ల వద్ద భారీగా పోలీసులను మోహరించాల్సి వచ్చింది. సినిమాలు విడుదలైన మొదటిరోజే ఉద్రిక్తలన్నీ తగ్గిపోయాయి. భారీ గ్రాఫిక్స్ ఉన్నప్పటికీ, కథనం నెమ్మదిగా ఉండటంతో 'మృగరాజు' భారీ డిజాస్టర్ గా నిలిచింది. చిరంజీవి సింహంతో పోరాడే సన్నివేశాలు మినహా మిగిలిన సినిమా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. 'నరసింహ నాయుడు' థియేటర్లకు వచ్చిన మొదటి ఆట నుంచే బాక్సాఫీస్ ను షేక్ చేసింది. "నీ గడ్డ మీద ఉన్నాను.. నా గడ్డం మీద చెయ్యేయ్" వంటి డైలాగులు థియేటర్లను హోరెత్తించాయి. తొలిసారిగా తెలుగులో రూ.30 కోట్ల వసూల్లు సాధించిన సినిమాగా నరసింహనాయుడు రికార్డు సృష్టించింది. సరికొత్త ఇండస్ట్రీ రికార్డులను క్రియేట్ చేసింది. 105 కేంద్రాల్లో 50 రోజులు, 79 కేంద్రాల్లో 100 రోజులు ఆడి సంచలనం సృష్టించింది.

# అందుకే.. విజయ్ జన నాయగన్ డిలే అయింది:



పవన్ కల్యాణ్‌నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఏప్రిల్ 9వ తేదీన కేరళ, అదే నెల 23వ తేదీన తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. ఒకేదశలో ఇవి ముగుస్తాయి. మే 4వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. ఈ వివరాలను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఎన్నికలు ఎదుర్కొంటోన్న నాలుగు రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కూడా ఉంది. ఈ రాష్ట్రంతో పాటు తమిళనాడు, కేరళ, అస్సాం, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరీ ఉన్నాయి. ఈ పరిణామాల మధ్య విజయ్ నటించిన జన నాయగన్ సినిమా విడుదలలో నెలకొన్న జాప్యంపై పవన్ కల్యాణ్ స్పందించారు. ఈ విషయంలో ఎన్డీఏ నిందించడం అన్యాయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సెన్సార్ బోర్డుతో తనకున్న అనుభవాలను ఆయన పంచుకున్నారు. సెన్సార్ బోర్డు ఆమోదం పొందేలా, ఆ స్థాయిలో జన నాయగన్ ను నిర్మాతలు తీర్చిదిద్దలేకపోయారని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. ఆ సినిమాతో పాటు తెరకెక్కిన 'ఓజీ' చిత్రానికి 'ఏ' సర్టిఫికేట్ వచ్చిందని గుర్తు చేశారు. హింసాత్మక సన్నివేశాలు ఉండటం వల్లే ఓజీకి ఏ సర్టిఫికెట్ వచ్చిందని వ్యాఖ్యానించారాయన. తాను ఎన్డీఏలో భాగస్వామి కావడం వల్లే ఓజీకి ఏ సర్టిఫికెట్ ఇచ్చారని చిత్ర నిర్మాతలు, దర్శకుడు చెప్పగా దాన్ని తోసిపుచ్చానని పవన్ కల్యాణ్ అన్నారు. చిత్రం నిండా హింసాత్మక సన్నివేశాలు ఉన్నప్పటికీ.. యూ/ఏ సర్టిఫికేట్ ఎలా ఆశించారని వారిని ప్రశ్నించినట్లు చెప్పుకొచ్చారు. నిబంధనలు అందరికీ ఒకటేనని, అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా మార్చలేమని వారికి చెప్పానని అన్నారు. ఓజీకి నిర్మాతలు క్లీన్ యూ/ఏ సర్టిఫికేషన్ ఆశిస్తూ మరోసారి దరఖాస్తు చేసుకోగా చివరికి సీబీఎఫ్సీ 'ఏ' సర్టిఫికేట్ తో సరిపెట్టిందని అన్నారు. సెన్సార్ బోర్డులో తనకు ఉన్న పరిచయాలను ఉపయోగించి సీబీఎఫ్సీ ప్రభావితం చేసే అవకాశాలు ఉన్నప్పటికీ.. అందుకు ప్రయత్నించలేదని, సినిమా- సెన్సార్ షిప్ ఎప్పుడూ లింక్ కాదని, అవి వేర్వేరు సంస్థలని పవన్ వ్యాఖ్యానించారు. ఉస్తాద్ భగత్ సింగ్' విషయంలో కూడా ఒక పాటలోని సాహిత్యాన్ని మార్చమని సెన్సార్ బోర్డు కోరినప్పుడు తాను దానికి కట్టుబడి ఉండాల్సి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. సెన్సార్ బోర్డులో ఇది అందరికీ జరుగుతుందని, జన నాయాగన్ నిర్మాతలు పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించి ఉండాల్సింది కాదని పవన్ పేర్కొన్నారు. కోర్టుకు వెళ్ళకుంటే, పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండేదని, ఒకసారి అది న్యాయస్థానానికి వెళ్ళిన తర్వాత, ఫలితం కోర్టు చేతుల్లో ఉంటుందని తేల్చి చెప్పారు.

# రేణు దేశాయ్‌పై అసభ్యకర కామెంట్లు..

## సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు, నిందితుల అరెస్ట్



సోషల్ మీడియాలో ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలపై టాలీవుడ్ సీనియర్ నటి రేణు దేశాయ్ కఠినంగా స్పందించారు. తనపై నిరంతరం దూషణలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్న కొందరిపై ఆమె సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే చర్యలు తీసుకున్నారు. సోషల్ మీడియాలో ఉన్న వారి అకౌంట్లను ట్రేస్ చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇటీవల రేణు దేశాయ్ వీధికుక్కల సమస్యపై ఒక మీడియా సమావేశంలో మాట్లాడిన తర్వాత సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు ఆమెను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. ఈ వ్యాఖ్యలు రోజురోజుకు తీవ్రతరం కావడంతో రేణు దేశాయ్ మొదట వారిని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా ప్రవర్తించొద్దని వార్నింగ్ ఇచ్చినా కూడా వారు తమ ప్రవర్తన మార్చుకోలేదు.దీంతో చివరకు రేణు దేశాయ్ సైబరాబాద్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డిజిటల్ ఫోరెన్సిక్ సాయంతో సోషల్ మీడియాలో ఉపయోగించిన అకౌంట్ల వివరాలను సేకరించి నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఇటీవల సెలబ్రిటీలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఇటువంటి కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.ఇదే సమయంలో ప్రముఖ యాంకర్ అనసూయ కూడా తనను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ కేసులో కూడా ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సంఘటనల నేపథ్యంలో సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు సృష్టించి ఎవరినైనా దూషించవచ్చని భావించే వారికి ఇది ఒక హెచ్చరికగా నిలుస్తోంది. నోటికి వచ్చినట్లు అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తే తప్పకుండా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.